STV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 44 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 22 నవంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |



# మిస్ యూనివర్స్‌గా మెక్సికో భామ

## ఫాతిమా బాష్‌కు అందాల కిరీటం

- పోటీల్లో పాల్గొన్న 121 దేశాల సుందరీమణులు
- అన్ని విభాగాల్లో రాణించిన ఫాతిమా
- భారత్ భామ మణిక విశ్వకర్మకు నిరాశ

03

ఈ ఏడాది విశ్వ సుందరి కిరీటం మెక్సికో భామను వరించింది. థాయ్‌లాండ్ వేదికగా జరిగిన మిస్ యూనివర్స్-2025 పోటీల్లో మిస్ మెక్సికో ఫాతిమా బాష్ విజేతగా నిలిచింది. గతేడాది మిస్ యూనివర్స్‌గా నిలిచిన డెన్మార్క్ భామ విక్టోరియా కెజార్ హెల్విగ్.. ఫాతిమాకు అందాల కిరీటాన్ని అందజేశారు. అందాల పోటీల్లో పాల్గొన్న తొలి ప్రయత్నంలోనే ఫాతిమా విశ్వసుందరిగా నిలిచి అందర్నీ ఆశ్చర్యపర్చారు.

# వెల్కమ్ మేడం

## రాష్ట్రపతికి స్వాగతం పలికిన గవర్నర్, సీఎం

**హైదరాబాద్, నవంబర్ 21:** రాష్ట్రపతి ద్రౌపది ముర్మును హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలి సిఎం రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. అలాగే రాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, హైదరాబాద్ సీపీ సజనార్, తదితరులు ఉన్నారు. తిరుపతి నుంచి [illegible]. హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి తిరిగి శని[illegible]రం పుట్టపర్తి వెళ్లనున్నారు.





02

# అంతరిక్ష ప్రయాణమే సులువు

బెంగళూరు రోడ్లు, ట్రాఫిక్‌పై

శుభాంశు శుక్లా వ్యాఖ్యలు

నెట్టింట్లో పెద్ద ఎత్తు చర్చ

# బూటకం

## మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ కట్టుకథ



### పోలీసుల వద్ద ఉన్నారనే ఆధారాలు లేవు

- హెబియస్ కార్పస్ పిటిషన్‌పై హైకోర్టు స్పష్టీకరణ
- మావోయిస్ట్ అగ్రనేతల విడుదలపై విచారణ

02

### హిడ్మా, రాజే, టెక్ శంకర్ ఎన్‌కౌంటర్ ఫేక్

15న పట్టుకొని క్రూరంగా చంపారు

హత్యాకాండకు నిరసనగా రేపు నిరసన

మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ సంచలన లేఖ

**రాయపూర్, నవంబర్ 21:** మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, ఆ పార్టీ అగ్రనేత హిడ్మాతో పాటు పలువురిని పోలీసులు క్రూరంగా హత్య చేసి ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించారంటూ మావోయిస్టు పార్టీ ఆరోపించింది. అందుకు నిరసనగా నవంబర్ 23వ తేదీన భారత్ బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ మేరకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట శుక్రవారం లేఖ విడుదల చేసింది. పోలీసుల క్రూర హత్యకు నిరసనగా దేశవ్యాప్తంగా బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు వివరించింది. నవంబర్ 18వ

మిగతా 2 లో



# ఇంకా టైం కావాలి

స్పీకర్‌ను కలిసి లేఖ అందజేసిన కడియం శ్రీహరి

సానుకూలంగా స్పందించిన గడ్డం ప్రసాద్

ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం ఉదయం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిశారు. తన వివరణకు అదనపు సమయం కావాలని లేఖ అందజేశారు. విజ్ఞప్తిపై స్పీకర్ సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.

02





# పంచాయితీ రిజర్వేషన్లపై కసరత్తు

- నేడు జీవో విడుదల చేయనున్న పంచాయితీరాజ్ శాఖ
- ఒకటి రెండు రోజుల్లో రిజర్వేషన్లు ఖరారు

02



02


# నిఖత్‌కు స్వర్ణం

సీఎం రేవంత్, డీజీపీ అభినందనలు

# భారీగా ఐపీఎస్‌ల బదిలీ

- 32మందికి స్థానచలనం
- పలు జిల్లాలకు కొత్త ఎస్పీల నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్‌రామకృష్ణారావు
- స్థానిక సంస్థల ఎన్నికల వేళ కీలక పరిణామం

వివరాలు 2వ పేజీలో







# రాష్ట్రంలో భారీ భూకుంభకోణం

- 4 లక్షల కోట్ల భూమికి రెక్కలు
- భూములపై రేవంత్ ముఠా
- నన్ను అరెస్ట్ చేసే ధైర్యం లేదు
- మీడియా సమావేశంలో కేటీఆర్

# హమాస్ తరహాలో దాడులు

## ఆయుధాల సమీకరణ

- ఆయుధాగారాలుగా ఆస్పత్రుల ఎంపిక
- ఎన్ఐఏ దర్యాప్తులో కుట్రలు వెల్లడి

04





03

# అబద్ధాల ప్రచారంలో కేటీఆర్ దిట్ట

- గతంలో లాగా అడ్డగోలు నిర్ణయాలకు మేం దూరం
- కేటీఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు



# దుబాయ్ ఎయిర్ షోలో ప్రమాదం

ప్రదర్శన సమయంలో కుప్పకూలిన తేజస్ యుద్ధ విమానం

04

# మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ కట్టుకథ

మొదటి పేజీ తరువాయి

తేదీ ఉదయం అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం అటవీ ప్రాంతం సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మా, ఆయన భార్య రాజేతోపాటు పలువురు మావోయిస్టులు మృతి చెందారు. వారి మృతదేహాలకు రంప చోడవరం ఏరియా ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించి.. ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలోని పువ్వర్తి గ్రామానికి తరలించారు. ఈ మృతదేహాలకు హిడ్మా కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఏడాది మేలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 28 మంది మావోయిస్టులు మరణించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో పార్టీ అగ్రనేత సంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మరణించారు. ఈ ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ.. జూన్ 10వ తేదీన భారత్ బంద్‌కు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మాతోపాటు పలువురు మావోయిస్టులు మృతి చెందడంతో.. నవంబర్ 23వ తేదీ ఆదివారం భారత్ బంద్‌కు పార్టీ పిలుపునిచ్చింది. 2026, మార్చి నెలాఖారు నాటికి దేశంలో మావోయిస్టులను



నిర్మూలిస్తామని కేంద్రం ప్రకటించింది. మావోయిస్టులు లొంగిపోయి.. జన జీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధికి పాటుపడాలని కేంద్రం పిలుపునిచ్చింది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మావోయిస్టులు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయారు. ఛత్తీస్‌గఢ్‌లో వీరి ప్రాబల్యం అధికంగా ఉంది. భద్రతా బలగాలతో కూంబింగ్ నిర్వహిస్తోంది. వరుస ఎన్‌కౌంటర్లతో వందలాది మంది మావోయిస్టులు మరణించారు. పలువురు మావోయిస్టులు అరెస్టయ్యారు. ఇంకొందరు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లింది. దేశంలో ఆ పార్టీ దాదాపుగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది.

# పోలీసుల వద్ద ఉన్నారనే ఆధారాలు లేవు

**హెబియస్ కార్పస్ పిటిషన్‌పై హైకోర్టు స్పష్టీకరణ**

**మావోయిస్ట్ అగ్రనేతల విడుదలపై విచారణ**





**అమరావతి, నవంబర్ 21:** మావోయిస్టు అగ్రనేతల ఆచూకీ కోసం ఏపీ హైకోర్టులో దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై శుక్రవారం మరోసారి విచారణ జరిగింది. మావోయిస్ట్ పార్టీ కీలక నేతలు దేవ్ జీ, రాజిరెడ్డి... పోలీసుల వద్ద ఉన్నారనేందుకు ప్రాథమిక ఆధారాలు లేవని.. వ్యాజ్యంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. పోలీసుల వద్ద ఆ ఇద్దరు అగ్రనేతలు ఉన్నారనే దానిపై ఆధారాలు లభిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు పిటిషనర్లకు వెసులుబాటు కల్పించింది. ఆపై మావోయిస్ట్ నేతల బంధువులు వేసిన పిటిషన్‌పై విచారణను ధర్మాసనం మూసివేసింది. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు దేవ్ జీ, మల్లా రాజిరెడ్డిని కోర్టులో హాజరుపరచాలని పోలీసులను ఆదేశించాలని కోరుతూ రాజారెడ్డి కుమార్తె స్నేహలత, దేవ్ జీ సోదరుడు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. దీనిపై గురువారం హైకోర్టులో విచారణ జరిగిన విషయం తెలిసిందే. మావోయిస్టు కీలక నేతలు తమ ఆధీనంలో ఉన్నారని పోలీసులు ప్రెస్‌స్టేట్‌మెంట్ ఇచ్చారని పిటిషనర్ తరపు న్యాయవాది తెలుపగా.. ఆధారాలు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. దీంతో నేటి విచారణలో పోలీసుల ప్రెస్ స్టేట్‌మెంట్‌కు సంబంధించిన వీడియోను పిటిషనర్ల తరుపు న్యాయవాది కోర్టుకు సమర్పించారు. వీడియోను చూసిన ధర్మాసనం.. సెక్యూరిటీ సిబ్బంది తమ అదుపులో ఉన్నారని పోలీసులు చెప్పినట్లు గుర్తించింది. దేవ్ జీ గురించి మీడియా ప్రతినిధులు అడగ్గా.. తమ ఆధీనంలో లేరని పోలీసు ఉన్నతాధికారులు చెప్పినట్లు వీడియోలో ఉందని న్యాయస్థానం గుర్తించింది. దీంతో దేవ్ జీ, రాజిరెడ్డిలు పోలీసుల నిర్బంధంలో ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు లేవని ధర్మాసనం నిర్ధారించింది. ఈ వ్యాజ్యంలో తాము జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేస్తూ.. పిటిషన్‌ను క్లోజ్ చేసింది.

# అంతరిక్ష ప్రయాణమే సులువు

- బెంగళూరు రోడ్లు, ట్రాఫిక్‌పై శుభాంశు శుక్లా వ్యాఖ్యలు
- వైరల్‌లగా మారి నెట్టింటో పెద్ద ఎత్తు చర్చ



**బెంగళూరు, నవంబర్ 21:** బెంగళూరులో రోడ్ల దుస్థితి , ట్రాఫిక్ సమస్యలపై విమర్శల వర్షం కొనసాగుతూనే ఉన్న. బయోకాన్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా, ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ వంటి ప్రముఖులు కూడా ఈ సమస్యలను లేవనెత్తారు. ఇక ఆన్‌లైన్ ట్రక్కింగ్ స్టార్టప్ బ్లాక్‌బక్ సీఈవో రాజేశ్ యాబాజీ ఏకంగా తమ ఆఫీస్‌ను బెంగళూరు నుంచి మార్చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ జాబితాలో వ్యోమగామి శుభాన్షు శుక్లా కూడా చేరారు. అంతరిక్షంలో ప్రయాణించడమే తేలిక..అంటూ బెంగళూరు ట్రాఫిక్‌పై వ్యోమగామి శుభాన్షు శుక్లా కామెంట్ చేశారు. అంతరిక్షయానంపై తాను చేసే ప్రసంగ సమయంతో పోలిస్తే బెంగళూరు రహదారులపై ప్రయాణం మూడు రెట్లు అధికమని వ్యోమగామి శుభాన్షు శుక్లా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారయి. గురువారం బెంగళూరు టెక్నాలజీ సమ్మిట్ లో 'ఫ్యూచర్ మేకర్స్ కాంక్లేవ్'కు హాజరయ్యే క్రమంలో మారతహళ్లి నుంచి మూడు గంటలపాటు ప్రయాణం చేయాల్సి వచ్చిందని శుక్లా పేర్కొన్నారు. ఇందులో మూడో వంతు సమయంలోనే తాను ప్రసంగాన్ని పూర్తి చేశానన్నారు. గత జూన్‌లో 'యాగ్జియం మిషన్' ద్వారా చేపట్టిన అంతరిక్ష ప్రయాణంపై ఆయన మాట్లాడుతూ అంతరిక్షంలో అడుగుపెట్టాక మన గుండెపై మోటారు వాహనం ప్రయాణించినట్లు ఉంటుందన్నారు. అక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు కనీసం వారం రోజులు పడుతుందని వివరించారు. భూమికి వచ్చాక రెండు వారాలపాటు మన శరీరం అదుపు తప్పే ఉంటుందని తన అనుభవాన్ని వివరించారు. ఈ ప్రయాణం భారతీయ అంతరిక్ష విజయానికి ప్రతీక అని తెలిశాక గర్వంగా ఉందన్నారు. మనకు, మన అంతరిక్ష ప్రగతికి హద్దుల్లేవని ప్రకటించారు. అంతరిక్షం నుంచి భారతదేశం ఎలా కనపడుతుందో శుభాన్షు వీడియో రూపంలో చూపారు. ఈ సందర్భంగా ఆయన బెంగళూరు రోడ్లు, ట్రాఫిక్ సమస్యపైనా చేసిన కామెంట్స్ వైరల్‌గా మారాయి. దేశ ఐటీ రాజధానిలో జరిగిన బెంగళూరు టెక్నాలజీ సమ్మిట్ లో 'ఫ్యూచర్ మేకర్స్ కాంక్లేవ్'కు శుభాన్షు శుక్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు తాను మారతహళ్లి నుంచి ఎగ్జిబిషన్ సెంటర్‌కు మూడు గంటలు ప్రయాణం చేయాల్సి వచ్చిం. ఇందులో మూడో వంతు సమయంలో నే తాను ప్రసంగాన్ని పూర్తి చేశానంటూ వ్యాఖ్యానించారు. మారతహళ్లి నుంచి బీఈఎస్ వేదిక అయిన బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌కు మధ్య 34 కిలోమీటర్ల దూరం ఉంటుంది. సాధారణంగా ఒక గంటలో ప్రయాణించవచ్చు.




# భారీగా ఐపీఎస్‌ల బదిలీ

**32మందికి స్థానచలనం • పలు జిల్లాలకు కొత్త ఎస్పీల నియామకం**

**హైదరాబాద్, నవంబర్ 21:** తెలంగాణలో స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధంచేస్తున్న వేళ ప్రభుత్వం భారీ ఎత్తున పోలీస్ అధికారులను బదిలీ చేసింది. పలు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించింది. డిసెంబర్‌లో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నోటిఫికేషన్ వస్తే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. దీంతో ముందుగానే ప్రభుత్వం ఐపిఎస్‌లను బదిలీ చేసినట్లు అర్థం అవుతోంది. ప్రస్తుతం ఉన్న వారిలో చాలామందిని బదిలీ చేసింది. ఈ క్రమంలో మొత్తం 32మంది ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అడిషనల్ డీజీగా జయేంద్రసింగ్ చౌహాన్, సీఐడీ డీజీగా పరిమళ హన నూతన్ జాకబ్, పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా చేతన్ మైలబత్తుల, మహేశ్వరం జోన్ డీసీపీగా కే నారాయణ రెడ్డి, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా పీవీ పద్మజలు నియమితులయ్యారు. ఇక నాగర్‌కర్నూల్ ఎస్పీగా సంగ్రామ్ సింగ్, హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా కిరణ్ ప్రభాకర్, మహబూబాబాద్ ఎస్పీగా శబరీష్, కుమ్రంభీం ఆసిఫాబాద్ ఎస్పీగా నిఖిత, టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా గిరిధర్, వికారాబాద్ ఎస్పీగా స్నేహా మిశ్రా బదిలి అయ్యారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా గైక్వాడ్ వైభవ్, ములుగు ఎస్పీగా కేకన్ సుధీర్ రామ్‌నాథ్, జయశంకర్ భూపాలపల్లి ఎస్పీగా సంకీర్త్, గవర్నర్ ఏడీసీగా పాటిల్ కాంతిలాల్ సుభాష్, పెద్దపల్లి డీసీపీగా రామ్ రెడ్డి, మల్కాజ్‌గిరి డీసీపీగా సీహెచ్ శ్రీధర్, భద్రాద్రి కొత్తగూడెం అడిషనల్ ఎస్పీగా అవినాష్ కుమార్, భువనగిరి అడిషనల్ ఎస్పీగా కంకణాల రాహుల్ రెడ్డి, జగిత్యాల అడిషన్ ఎస్పీగా శేషాద్రిని రెడ్డి, ములుగు అడిషనల్ ఎస్పీగా శివం ఉపాధ్యాయ, ఆదిలాబాద్ అదనపు ఎస్పీగా మౌనిక, ఏటూరు నాగారం ఏఎస్పీగా మనన్ భట్, నిర్మల్ ఏఎస్పీగా సాయికిరణ్, వేములవాడు ఏఎస్పీగా రుత్విక్ సాయి, సత్తుపల్లి ఏసీపీగా యాదవ్ వసుంధర, టీజీ ట్రాన్స్‌కో ఎస్పీగా శ్రీనివాస్, వనపర్తి ఎస్పీగా సునీత నియామకం అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# పంచాయితీ రిజర్వేషన్లపై కసరత్తు

**నేడు జీవో విడుదల చేయనున్న పంచాయితీరాజ్ శాఖ**

**ఒకటి రెండు రోజుల్లో రిజర్వేషన్లు ఖరారు**




**హైదరాబాద్, నవంబర్ 21:** పంచాయితీ ఎన్నికలకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ క్రమంలో మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామ పంచాయతీలు, వార్డుల రిజర్వేషన్ల విధి విధానాలు పంచాయతీ రాజ్ శాఖ ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు శనివారం జీవో ఇవ్వనుం ది. రిజర్వేషన్లు 50శాతం మించకుండా కొత్త రిజర్వేషన్లను సిఫార్సు చేస్తూ డెడికేటెడ్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి గురువారం నివేదిక సమర్పించింది. డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులను సర్క్యులేషన్ విధానంలో రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. మంత్రుల వద్దకు ఫైలు పంపించి ఆమోదిస్తున్నట్లు సంతకాలు తీసుకున్నారు. ఈ క్రమంలో పంచాయతీలు, వార్డుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లపై విధివిధానాలు ఖరారు చేస్తూ పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేయనుంది. జీవోకు అనుగుణంగా ఎంపీడీవోలు వార్డులకు, ఆర్డీవోలు సర్పంచి పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. రాజకీయ పార్టీల సమక్షంలో లాటరీ పద్ధతిలో మహిళలకు సీట్లు కేటాయిం చనున్నారు. శని, ఆదివారాల్లో జిల్లాల యంత్రాంగం రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయనుంది. రిజర్వేషన్లు ఖరారు చేసిన తర్వాత పంచాయతీ ఎన్నికల కు సంసిద్ధత వ్యక్తం చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ రాయనుంది. ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నామని, పిటిషన్‌పై విచారణ ముగించాలని ఈనెల 24న హైకోర్టుకు ప్రభుత్వం, ఎస్ఈసీ తెలపనున్నాయి. హైకోర్టు అంగీకరిస్తే అదే రోజు లేదా మరుసటి రోజు షెడ్యూలు విడుదల చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. మొత్తానికి ఇటీవల కేబినేట్‌లో ఆమోదించిన మేరకు డిసెంబర్ రెండోవారంలో నోటిఫికేషన్ విడుదల కానుంది.



# రాయపూర్‌లో 3 రోజులు డీజీపీల సమావేశం

**హాజరవుతున్న ప్రధాని మోడీ, అమిత్‌షా హాజరు**

**రాయపూర్, నవంబర్ 20:** ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఈ నెల 28 నుంచి 30 వరకు అన్ని రాష్ట్రాల డీజీపీల సమావేశం జరగనున్నది. ఈ సమావేశానికి ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా హాజరుకానున్నారు. ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఐజీలు, సీనియర్ అధికారులు పాల్గొంటారు. ఈ వార్షిక సమావేశంలో ప్రధానంగా ఆపరేషన్ కగార్ పురోగతి, ఉగ్రవాద దాడుల నిరోధక వ్యూహాలు ప్రధాన అజెండాగా ఉండనున్నాయని తెలిసింది. మావోయిస్టుల లొంగుబాట్లు, వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతున్న నేపథ్యంలో ప్రధాని, కేంద్ర హోంమంత్రి హాజరవుతుండటంతో సమావేశానికి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం భారీ స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ప్రత్యేక కమాండోలు, సీఆర్‌పీఎఫ్, ఎన్ఐఏ, ఐబీ బృందాలు రాయ్‌పూర్ చేరుకుని వ్యూహాత్మక భద్రతా ప్రణాళికను అమలు చేస్తున్నాయి. ఈ సమావేశానికి తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ డీజీ విజయ్‌కుమార్, ఎస్ఐబీ చీఫ్ సుమతి తదితరులు హాజరుకానున్నారు. శాటిలైట్ నిఘా, డ్రోన్ పెట్రోలింగ్, గ్రౌండ్ ఆపరేషన్స్ ను మరింత సమర్ధవంతంగా మార్చడంపై కీలక నిర్ణయాలు తీసుకుంటారని అధికారవర్గాలు చెప్తున్నాయి. ఇటీవలి వరుస ఎన్‌కౌంటర్లు, హిడ్మా తదితరుల హతం తరవాత దీనికి ప్రత్యేకత ఏర్పడింది.

# నిఖత్ జరీన్‌కు స్వర్ణం

**సీఎం రేవంత్, డీజీపీ అభినందనలు**



**హైదరాబాద్, నవంబర్21:** భారత బాక్సింగ్ స్టార్, తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ తాజాగా మరో స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. వరల్డ్ బాక్సింగ్ కప్ లో భాగంగా 51 కిలోల విభాగంలో స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. నవంబర్ 20న జరిగిన ఫైనల్ మ్యాచ్ లో చైనీస్ తైపీకి చెందిన జువాన్ యి గోవోపైన విజయం సాధించింది. ఆమెపై ఏకంగా 5-0 తేడాతో విజయం సాధించిన నిఖత్ జరీన్ స్వర్ణ పతకం అందుకుంది. దీంతో తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ పై ప్రశంసల వర్షం కురుస్తోంది. నిఖత్ జరీన్ సాధించిన ఈ పతకంతో ప్రస్తుత బాక్సింగ్ కప్ లో మహిళలు సాధించిన పథకాల సంఖ్య ఐదుకు చేరుకోవడం జరిగింది. నిఖత్ జరీన్ అద్భుతమైన ప్రతిభ కనబరిచి ప్రపంచ వేదికపై తెలంగాణ కీర్తిని చాటి చెప్పారని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఈ విజయం యువ క్రికెటర్లకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని కూడా చెప్పారు. ఫ్యూచర్ లో నిఖత్ జరీన్ మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరాలని కోరారు. ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్‌లో నిఖత్ జరీన్ గోల్డ్ మెడల్ సాధించడంపై డీజీపీ శివధర్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఉత్తర ప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో నిర్వహించిన ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్‌లో నిఖత్ జరీన్ గోల్డ్ మెడల్ సాధించారని తెలిపారు. ఆమె తెలంగాణ స్పెషల్ పోలీస్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గా పనిచేస్తున్నారని గుర్తు చేశారు. బంగారు పతాకం సాధించినందున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం నిఖత్ జరీన్ సామర్థ్యం, కృషి, అంకితభావానికి నిదర్శనం అన్నారు. ఇక నిఖత్ గోల్డ్ మెడల్ సాధించి తెలంగాణ పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచిందని తెలిపారు. క్రీడల్లో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పిన నిఖత్ విజయం ఇతర క్రీడాకారులకు ఆదర్శం అంటూ వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర కుటుంబం తరపున నిఖత్ జరీన్ భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి శిఖరాలు అందుకోవాలని పేర్కొన్నారు.

# ఇంకా టైం కావాలి

**స్పీకర్‌ను కలిసి లేఖ అందజేసిన కడియం శ్రీహరి**



**హైదరాబాద్, నవంబర్ 21:** ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిశారు. ఈ నెల 23 లోపు పార్టీ ఫిరాయింపు ఆరోపణలపై వివరణ ఇవ్వాలని స్పీకర్ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఆయన కలిశారు. పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులకు సమాధానాలు ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మరోసారి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 23వ తేదీలోగా సమాధానాలను అఫిడవిట్ రూపంలో స్పీకర్ కార్యాలయంలో అందజేయాలని వాటిలో సూచించారు. గత ఆగస్టులో ఫిర్యాదులొచ్చిన 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. వారిలో దానం, కడియం మినహా మిగిలిన ఎనిమిది మంది తమ సమాధానాలను అఫిడవిట్ రూపంలో అసెంబ్లీ కార్యదర్శికి దాఖలు చేశారు.ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తక్షణమే వివరణ ఇవ్వాలని కోరుతూ స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం మరోసారి నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఎమ్మెల్యే కడియం శ్రీహరి కలిశారు. ఈ నెల 23వ తేదీ లోపు ఫిరాయింపు ఆరోపణలపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో స్పీకర్ పేర్కొన్నారు. దీంతో వివరణ ఇచ్చేందుకు మరింత సమయం కావాలని స్పీకర్‌ను కడియం శ్రీహరి కోరారు. ఢిల్లీ నుండి రాగానే స్పీకర్‌ను దానం నాగేందర్ కలవనున్నారు. దానం నాగేందర్ మరింత సమయం కోరుతాడా లేదా రాజీనామా చేస్తాడా అనే అంశంపై సందిగ్ధత నెలకొంది.

# అబద్ధాల ప్రచారంలో కేటీఆర్ దిట్ట

- గతంలో లాగా అడ్డగోలు నిర్ణయాలకు మేం దూరం
- ఉపాధి, ఉద్యోగాల కోసం పెట్టుబడుల వేట
- గతంలో ఇచ్చిన జీవోల ఆధారంగానే భూ కేటాయింపులు
- ఎవ్వరికీ భూములు దోచిపెట్టే పరిస్థితి లేదు
- కేటీఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, నవంబర్ 21:** పదేళ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ రాష్ట్ర ప్రజలకు అసత్యాలు చెబుతున్నాని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం సిఎం రేవంత్ నేతృత్వంలో పెట్టుబడుల కోసం, ఉపాధి, ఉద్యోగాల కల్పనకు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నదని అన్నారు. అచిర కాలంలోనే తెలంగాణ అనేక విజయాలు సాధించిందని అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా అడ్డగోలుగా జీవోలు, చెల్లింపులు చేయడం లేదని, వారి హయాంలో ఏం చేసినా దాని వెనుక ఓ మతలబు ఉండేదని ఆరోపించారు. శుక్రవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మా కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలపై కేటీఆర్ ఆరోపణలు చేశారు. మొత్తం 9,292 ఎకరాల భూమి గురించి మాట్లాడారు. పరిశ్రమలను ప్రోత్సహించాలని ప్రభుత్వం భూములను తక్కువ ధరకు ఇస్తోంది. 2023లో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం మూడు జీవోలు ఇచ్చింది. ఆ జీవో ప్రకారం హైదరాబాద్‌లోని భూములను ట్రాన్స్‌ఫర్‌కు అనుమతి ఇచ్చారు. ప్రభుత్వ భూమి అమ్ముకున్నట్టు కేటీఆర్ మాట్లాడుతున్నారు. ఫ్రీహోల్డ్, ల్యాండ్ లీజ్‌కు తేడా లేకుండా మాట్లాడారు. 2023లో భారత రాష్ట్ర సమితి తెచ్చిన జీవో ప్రకారమే భూములు ఇస్తున్నాం. భూమి హక్కులు ఉన్న వారికి మేలు చేయాలని చూస్తున్నాం. గత ప్రభుత్వం హయాంలో చాలా భూములు బదిలీ చేశారు. పరిశ్రమలకు ఉపయోగపడాలని గ్రిడ్ పాలసీ తీసుకున్నారని అనుకున్నాం. పారిశ్రామిక వేత్తలను ఇబ్బంది పెట్టకూడదు. పెట్టుబడులు రావాలని రాయితీలతో కూడిన పాలసీలు తీసుకుంటాం. కొన్ని రాష్ట్రాల్లో 99 పైసలకే భూములు ఇస్తున్నారు. పెట్టుబడులు రావాలి, ఉపాధి పెంచాలి అనేది మా లక్ష్యం. ఫ్రీహోల్డ్ ల్యాండ్ ఉన్నవారు పాలసీ ద్వారా అవకాశం ఉంటే దరఖాస్తు చేసుకుంటారని అన్నారు. భారత రాష్ట్ర సమితి నేతలు అభూత కల్పనలతో రాష్ట్ర ప్రజలకు సత్యదూరమైన మాటలు చెబుతున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి తర్వాత ఆ పార్టీ నేతలకు పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. పెట్టుబడులు రాకూడదు, రాష్ట్ర అభివృద్ధి జరగకూడదు అనేది కేటీఆర్ ఆలోచన. ఆధారాలు ఉంటేనే మాట్లాడాలి. కేటీఆర్ కొంత మంది పేర్లు చెప్పారు.. వారు ప్రభుత్వంలో లేరు. ఆధారాలు ఉంటే చెప్పండి.. చర్యలు తీసుకుంటాం అని శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేలా అబద్ధాల ప్రచారం మానుకోవాలన్నారు. గతంలో లాగా అడ్డగోలు నిర్ణయాలు జరగడం లేదన్నారు. స్వలాభం అన్నదానికి వారు హయాంలో తీసుకున్న నిర్ణయాలే నిదర్శనమని శ్రీధర్ బాబు అన్నారు.

# త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ

**ఏటీసీలుగా 65 ఐటీఐ కళాశాలల మార్పు**

**జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క**



**హైదరాబాద్, నవంబర్ 21:** 65 ఐటీఐ కళాశాలలను ఏటీసీలుగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని జేఎన్టీయూ డైమండ్ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. విద్యార్థుల భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. జేఎన్‌టీయూ ఒక విశ్వవిద్యాలయం మాత్రమే కాదని.. ఇది దేశానికి, ముఖ్యంగా తెలంగాణకు గొప్ప ఆస్తి అని పేర్కొన్నారు. ఇంజనీర్లను తయారు చేసే శక్తివంతమైన దేశ ఇంజిన్ అని ప్రశంసించారు. విద్యార్థుల ప్రతిభ ప్రపంచానికి ఎంతో గర్వకారణమన్నారు. విద్య అనేది ఖర్చు కాదని, భవిష్యత్తును నిర్మించే పెట్టుబడని విద్యార్థులకు భట్టి విక్రమార్క సందేశం ఇచ్చారు. ఉద్యోగాలు వెతికే వారిగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే వారిగా ఎదగాలని సూచించారు. మొదటి 60 ఏళ్ల కంటే, వచ్చే 60 ఏళ్లు మరింత మహోన్నతంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు.

# రాష్ట్రంలో భారీ భూకుంభకోణం

**4 లక్షల కోట్ల విలువచేసే భూమికి రెక్కలు**

**భూములపై వాలిపోతున్న రేవంత్ ముఠా**

**నన్ను అరెస్ట్ చేసే ధైర్యం రేవంత్‌కు లేదు**

**మీడియ సమావేశంలో కేటీఆర్ విమర్శలు**



**హైదరాబాద్, నవంబర్ 21:** రాష్ట్రంలో భారీ భూకుంభకోణం జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఏకంగా నాలుగు లక్షల కోట్ల విలువచేసే భూమిని కొల్లగొట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి ముఠా కుట్ర చేస్తున్నదని ఆయన సంచలన ఆరోపణ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ యువతకు ఉద్యోగాలు ఇవ్వలేకపోయిందని విమర్శించారు.తెలంగాణ భవన్‌లో కేటీఆర్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూములు ఎక్కడున్నా రేవంత్ ముఠా అక్కడ వాలిపోతోందని అన్నారు. ఎంతో విలువైన భూములపై రేవంత్ కుటుంబసభ్యుల కన్ను పడిందని ఆరోపించారు. బాలానగర్ పరిసరాల్లో సుమారు 9300 ఎకరాల భూకుంభకోణం జరుగుతోందని చెప్పారు. బాలానగర్, కాటేదాన్, జీడిమెట్లలో రేవంత్ తన వాళ్లకు భూములిచ్చారని విమర్శించారు. మొత్తం నాలుగు లక్షల కోట్ల కుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. జపాన్‌లో ఉన్నప్పుడు కూడా ఆ భూమికి సంబంధించిన ఫైల్‌పై రేవంత్ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ప్రతి ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు రాయితీలు ఇస్తుందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం హైదరాబాద్‌లో అతిపెద్ద భూకుంభకోణానికి తెరలేపిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో 2022లో భూముల రెగ్యులేషన్ కోసం చట్టం తీసుకొచ్చామని, భూములకు వంద శాతం ఫీజులు చెల్లించేలా నిబంధన చేర్చామని కేటీఆర్ తెలిపారు. భూములు వేరేవాళ్లకు అమ్ముకుంటే రెండు వందల శాతం చెల్లించాలని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు పట్టించుకోకుండానే భూ కేటాయింపులు చేసిందని విమర్శించారు. 30 శాతం చెల్లిస్తే రెగ్యులర్ చేస్తామని ఉత్తర్వులు ఇచ్చారని ఆరోపించారు. ఇకపోతే రేవంత్ రెడ్డి నన్ను అరెస్టు చేసే ధైర్యం చేయరు. ఈ ఫార్ములా రేస్ కేసులో ఏమీ లేదని రేవంత్ రెడ్డికి కూడా తెలుసు. ఏ తప్పూ చేయలేదు.. లై డిటెక్టర్ టెస్టుకైనా సిద్ధమే అని కేటీఆర్ పేర్కొన్నారు. కడియం శ్రీహరిని కాపాడేందుకు దానం నాగేందర్‌తో రాజీనామా చేయించే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడితే ప్రభుత్వం పరువు పోతుందని ముందుగానే ఎమ్మెల్యేలచే రాజీనామా చేయించేందుకు సిద్ధమవుతున్నారు. ముందుగా జీహెచ్‌ఎంసీ ఎన్నికలు వస్తాయి. ఆ తర్వాత ఉప ఎన్నికలు వస్తాయి అని కేటీఆర్ పేర్కొన్నారు.

# స్వదేశీ వినియోగం పెరగాలి



**హైదరాబాద్, నవంబర్ 21:** భారతదేశంలో స్వదేశీ వస్తువుల వినియోగం పెరగాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సూచించారు. ప్రజల ఆలోచనా స్వదేశీ వస్తువులని వినియోగించేలా ఉండాలని కోరారు. భారతదేశం ఇతర దేశాల వస్తువుల మీద ఆధారపడకూడదని ఆత్మనిర్భర్ భారత్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారని గుర్తుచేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆత్మనిర్భర్ భారత్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో రామచంద్రరావు, బీజేపీ నేతలు చంద్రశేఖర్ తివారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడారు. యాంటీ ఇండియా ఐడియాలజీ ఉన్నవారికి కాంగ్రెస్ నిన్న ఇందిరా గాంధీ అవార్డులు ఇవ్వడం దుర్మార్గమని మండిపడ్డారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా మనమందరం ముందుకెళ్లాలని సూచించారు.

## రైతుల ఆత్మహత్యపై
# స్పందించరేం!

**భూమాత వచ్చినా సమస్యలు పరిష్కరించరా**

**సీఎం రేవంత్ రెడ్డి తీరుపై హరీష్ రావు విమర్శలు**

**హైదరాబాద్, నవంబర్ 21:** ఒక్క రైతు కూడా భూ సమస్య వల్ల ఆత్మహత్య చేసుకోకూడదు. రైతుల భూమి హక్కులు 100 శాతం కాపాడతాం అని ఎన్నికల ప్రచారంలో అదరగొట్టిన రేవంత్‌రెడ్డికి మీ పార్టీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల వద్ద, తహసిల్దార్ కార్యాలయాల వద్ద జరుగుతున్న రైతు ఆత్మహత్యాయత్నాలు కనిపించడం లేదా అని మాజీ మంత్రి హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. అధికారం లోకి వస్తే 3 నెలల్లో భూమి సమస్యలు పరిష్కరిస్తాం అన్న హామీ ఏమైంది రేవంత్ రెడ్డి అని నిలదీశారు. భూముల రికార్డులు సరిచేస్తాం, రైతుల హక్కులు కాపాడతాం అని చెప్పి మీరు రెండేళ్లుగా కుంటి సాకులు చెబుతూ రిజిస్ట్రేషన్లు చేయకుండా రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. రైతు భూమి మీద ఆ రైతుకే హక్కు లేకుండా చేస్తున్న దుర్మార్గ ప్రభుత్వం మీది. ఇది రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ద్రోహం. ఆపదకో, అవసరానికో ఉన్న భూములు అమ్ముకోలేక.. అధిక వడ్డీకి రుణాలు తీసుకోలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.ప్రజా పాలన దరఖాస్తులు ఏమయ్యాయి? రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయని అన్నారు. ధరణి పేరు మార్చి తెచ్చిన భూ భారతి ఏమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 70 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే మీ ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? నెలల తరబడి రెవెన్యూ ఆఫీసులు,కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా రైతులు, ప్రజల సమస్యలు మాత్రం పరిష్కారమవడం లేదు. ఇప్పటికే మీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వల్ల 700 పైగా అన్నదాతలు ప్రాణాలు కోల్పోయారు. రుణమాఫీ కాక, రైతు భరోసా అందక, పంట బోనస్ ఇవ్వక పోవడంతో రైతులు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, రెవెన్యూ శాఖ మేలుకుని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, రైతు ఆత్మహత్యలు చేసుకోకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.






## మిస్ యూనివర్స్‌గా మెక్సికో భామ
# ఫాతిమా బాష్

**పోటీల్లో పాల్గొన్న 121 దేశాల సుందరీమణులు**

**భారత్ భామ మణిక విశ్వకర్మకు నిరాశ**

**థాయ్‌లాండ్, నవంబర్21:** ఈ ఏడాది విశ్వ సుందరి కిరీటం మెక్సికో భామను వరించింది. థాయ్‌లాండ్ వేదికగా జరిగిన మిస్ యూనివర్స్-2025 పోటీల్లో మిస్ మెక్సికో ఫాతిమా బాష్ విజేతగా నిలిచింది. గతేడాది మిస్ యూనివర్స్‌గా నిలిచిన డెన్మార్క్ భామ విక్టోరియా కెజార్ హెల్విగ్.. ఫాతిమాకు అందాల కిరీటాన్ని అందజేశారు. అందాల పోటీల్లో పాల్గొన్న తొలి ప్రయత్నంలోనే ఫాతిమా విశ్వసుందరిగా నిలిచి అందర్నీ ఆశ్చర్యపర్చారు. ప్రపంచ దేశాల నుంచి దాదాపు 120 మందికి పైగా ఈ పోటీల్లో పాల్గొనగా.. వారందరినీ వెనక్కినెట్టి ఈ 25 ఏళ్ల భామ అందాల కిరీటాన్ని దక్కించుకుంది. ఇక తొలి రన్నరప్‌గా థాయ్‌లాండ్‌కు చెందిన ప్రవీనర్ సింగ్, రెండో రన్నరప్‌గా వెనెజువెలాకు చెందిన స్టిఫానీ అబాసలీ నిలిచారు. మెక్సికోలోని శాంటియాగో డి తెపా ప్రాంతానికి చెందిన ఫాతిమా.. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేశారు. స్కూల్‌లో చదువుతున్నప్పుడు డిస్లెక్సియా, హైపర్‌యాక్టివిటీ డిజార్డర్‌తో బాధ పడినట్లు ఫాతిమా గతంలో తెలిపారు. వాటిని దాటుకొని అందాల పోటీలకు ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉందన్నారు. ఈ ఏడాది సెప్టెంబరులో జరిగిన మిస్ యూనివర్స్ మెక్సికో 2025 పోటీల్లో విజేతగా నిలిచారు. ఈ పోటీల్లో భారత్ నుంచి మణికా విశ్వకర్మ ప్రాతినిధ్యం వహించినప్పటికీ.. ఆమె కిరీటం దక్కించుకోలేకపోయారు. రాజస్థాన్‌కు చెందిన మణిక.. స్విమ్‌సూట్ రౌండ్‌తో టాప్ 30 వరకు చేరుకుంది. టాప్ 12లో నిలవలేకపోవడంతో ఈ ఏడాది భారత్‌కు అందాల కిరీటం చేజారింది. ఇక, మిస్ యూనివర్స్ పోటీల్లో మన బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్.. న్యాయనిర్ణేతల్లో ఒకరిగా ఉండటం విశేషం.

# స్పోర్ట్స్ విజేతలకు సీఎం అభినందనలు



**హైదరాబాద్, నవంబర్ 21:** 4వ ఇఎంఆర్ఎస్ నేషనల్ స్పోర్ట్స్ మీట్-2025లో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను సాధించిన తెలంగాణ విద్యార్థులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈఎంఆర్ఎస్ నేషనల్ స్పోర్ట్స్ మీట్-2025లో రికార్డ్-బ్రేకింగ్ మెడల్స్ సాధించిన తెలంగాణ అథ్లెటిక్స్, ఆర్చరీ, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, బాక్సింగ్, జూడో, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, టైక్వాండో, యోగా, షూటింగ్, చెస్ ఇతర ఈవెంట్లలో అన్ని రాష్ట్రాలకంటే అత్యధికంగా 230 పతకాలను తెలంగాణ సాధించింది. నవంబర్ 15న ఒడిశాలో జరిగిన ఈ పోటీల్లో తెలంగాణలోని 23 సంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.. దేశవ్యాప్తంగా ఈ జాతీయ క్రీడా పోటీల్లో 22 రాష్ట్రాలలోని 499 సంస్థలకు చెందిన 5,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 22 ఈవెంట్లలో పోటీలు నిర్వహించగా ఇందులో వ్యక్తిగత ఈవెంట్లు - 15, జట్టు ఈవెంట్లు 07, తెలంగాణ తరపున ఈ జాతీయ ఈవెంట్‌లో 23 పాఠశాలలకు చెందిన 580 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వ్యక్తిగత, జట్టు ఈవెంట్లలో అత్యుత్తమ ప్రదర్శనను తెలంగాణ విద్యార్థులు ప్రదర్శించారు.మొత్తం 714 పాయింట్లతో అద్భుతమైన ఛాంపియన్‌షిప్‌ను తెలంగాణ కైవసం చేసుకున్నది .

# హైదరాబాద్‌లో మరో జాతీయ సదస్సు

**డిసెంబర్‌లో చారిత్రక నాణెల సదస్సు ■ మంత్రి జూపల్లి**

**హైదరాబాద్, నవంబర్ 21:** హైదరాబాద్ మరో జాతీయ సదస్సుకు వేదిక కాబోతున్నది. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా జాతీయ స్థాయిలో చారిత్రక నాణెల సదస్సు నిర్వహణకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర వారసత్వ శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 11, 12 తేదీల్లో 107వ వార్షిక జాతీయ నాణెల సదస్సు, సెమినార్‌ను నిర్వహించనున్నారు. ఈ సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం సచివాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు లాంఛనంగా ఆవిష్కరించారు. న్యూమిస్మాటిక్ సొసైటీ ఆఫ్ ఇండియా సహకారంతో తెలంగాణ వారసత్వ శాఖ సంయుక్తంగా ఈ ప్రతిష్టాత్మక సదస్సును నిర్వహిస్తోంది. రాష్ట్ర ఆవిర్భావం తరువాత నాణెల అధ్యయనంపై ఇంతటి ముఖ్యమైన జాతీయ స్థాయి కార్యక్రమం హైదరాబాద్‌లో జరగడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. నాణెల చరిత్ర ద్వారా తెలంగాణ రాష్ట్ర గొప్ప చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని దేశానికి చాటి చెప్పేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఎంసిఆర్ హెచ్ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్‌లో డిసెంబర్ 11, 12న ఈ సదస్సు జరగనుంది. భారతదేశ నలుమూలల నుంచి విద్యార్థులు, స్కాలర్స్, పరిశోధకులు (రీసర్చర్స్), న్యూమిస్‌మటిక్స్ నిపుణులు పాల్గొనే ఈ సదస్సు, నాణెల చారిత్రక, సాంస్కృతిక, కళాత్మక ప్రాముఖ్యతపై చర్చించేందుకు ఒక వేదికగా ఉపయోగపడనుందని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, వారసత్వ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి, డిప్యూటీ డైరెక్టర్లు డా. డి. రాములు, డా. పి. నాగరాజు పాల్గొన్నారు.





సంపాదకీయం

# నక్సల్స్ ఏరివేతే కాదు గిరిజనుల అభివృద్ధి ముఖ్యం!

కార్పొరేట్ల కన్ను అటవీ ప్రాంతాలపైన, కొండల కింద ఉన్న గనుల పైన పడటంతో గిరిజనులను అక్కడి నుండి వెళ్లగొట్టడానికి వివిధ పేర్లతో కుట్రలు జరుగుతున్నాయన్నది లెఫ్ట్ పార్టీల వాదనగా ఉంది. ఇది ఎంత వరకు నిజయమో తెలియాలి. ఇదే నిజమైతే దీనికి ప్రజాస్వామ్య పద్దతిలో లెఫ్ట్ నేతలు కూడా పోరాటం చేపట్టాలి. ప్రజలను సమీకరించాలి. అడవులను నాశనం చేసేవారు ఎంతటి వారైనా నిలదీయాల్సిందే. అటవీ హక్కులను తిరస్కరిస్తున్నట్లుగా గుర్తిస్తే అందుకు ప్రజా ఉద్యమాలను నిర్వహించాలి. గిరిజనులతో నామమాత్రంగా కూడా చర్చించకుండానే పలు ప్రాజెక్టులను వారి నివాస ప్రాంతాల్లో చేపడుతున్నట్లుగా ఆరోపణలు చేస్తున్నారు. చట్ట ప్రకారం తప్పనిసరైన గ్రామసభలనుసైతం దాటవేస్తున్నారు. ఈ తరహా సర్కారీ దమనకాండపై అసంతృప్తిని, నిరసనను వ్యక్తం చేయడానికి కూడా అవకాశం ఇవ్వకుండా ఉక్కుపాదం మోపుతున్నారని అంటున్నారు. లెఫ్ట్ పార్టీలకు ఉద్యమాలు, పోరాటాలు కొత్త కాదు. ఇవే నిజమైతే ప్రజా ఉద్యమాలను నిర్మించాల్సిందే. కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్లుగానే తీవ్ర నిర్బంధ చర్యల ద్వారా మావోయిస్టులపై పై చేయి సాధించవచ్చు. కానీ, అణచివేతకు గురవుతున్న ప్రజానీకపు జీవన పరిస్థితుల్లో మార్పు రాకుంటే వారిలోని అసంతృప్తి మరోరూపం తీసుకోవచ్చు. ఇది ఒక సామాజిక ఆర్థిక సమస్య. క్షేత్రస్థాయిలో అసమానతలు రూపుమాపడమే దీనికి పరిష్కారం కావాలి. అలాగే గిరిజనులను పాలనలో భాగస్వాములను చేయాలి. వారి నివాస ప్రాంతాల్లో అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో నిర్ణయాధికారం వారిదే కావాలి. విద్య, వైద్య సౌకర్యాలతో పాటు ఉపాధిని పెద్ద ఎత్తున కల్పించాలి. దీంతో అడవుల్లో అన్నల అవసరం రాకపోవచ్చు. మావోయిస్టుల పేరుతోనో, వారి సానుభూతిపరుల పేరుతోనో గిరిజనులపై పోలీసుల వేధింపులను, నిర్బంధాన్ని తక్షణం నిలిపివేయాలి. ఇకపోత నక్సల్స్ ఏరివేత వెనక ఇదే పరమార్థం అని అంటున్నారు. నక్సల్స్ ఏరివేతతో అటవీ సంపద వినాశనాన్ని ముడిపెట్టరాదు. ఇవి రెండు కూడా వేర్వేరు అంశాలు. అందువల్ల మావోయిస్టులు ఏరివేతను అడవుల సంరక్షణతో పోల్చరాదు. అడవులను కార్పోరేట్లకు కట్టిపెడుతున్నారని కచ్చితమైన సమచారం ఉంటే ఎవ్వరైనా పోరాడవచ్చు. ఇకపోతే లొంగిపోవడానికి వచ్చిన నక్సల్స్ నేత హిడ్మాను, ఆన భార్య, ఇతర అనుచరులను మట్టుపెట్టారని, క్రెడిట్ దక్కించుకోవడానికే పోలీసులు ఈ పనిచేశారని వస్తున్న వార్తలపై పోలీసులే నిజాలు వెల్లడిస్తారని అనుకుంటే పోరపాటే. ఎందుకంటే ఖాకీ దుస్తులు వేసుకున్న తరవాత వారికి మానవత్వం అన్నది ఉండదు. నక్సలైట్ ఉద్యమంలో ఎందరో పోలీసులు అసువులు బాసారు. ఎందరో క్రూరంగా హత్యకు గురయ్యారు. మందుపాతరలకు బలయ్యారు. ఇవన్నీ వారు తప్పకుండా పరిగణలోకి తీసుకుంటారు. దీనికితోడు ప్రభుత్వం వారికి టార్గెట్లు విధించింది. అందువల్ల చిక్కిన అవకాశాన్ని వదులుకోరు. అందులోనూ నక్సల్స్ విషయంలో అస్సలు ఉండదు. మనం ఇక్కడ రెండు వైపులా ఆలోచన చేయాలి. నక్సల్స్ కూడా తమ ఉద్యమంలో కిరాతకంగా వ్యవహరించారు. చంపడంలో ఆరితేరారు. ఖతం చేయడమే వారి ఉద్యమంగా సాగింది. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. మెంత్తంగా నక్సల్స్ ఉద్యమంలో రెండువైపులా ప్రాణనష్టం జరిగింది. అమాయకులను ఎందరినో వారు పొట్టన పెట్టుకున్నారు. నేతలను బలితీసుకున్నారు. దీంతో వారు సాధించిందేమీ లేకపోగా, ఉద్యమం వల్ల దేశానికి తీవ్ర నష్టమే జరిగింది. అందుకే హిడ్మా లొంగిపోవడానికి వచ్చినా పట్టుకుని కాల్చేశారని అంటున్నారు. పోలీసులు అవకాశం కోసం చూస్తారు. అదను చూసి దెబ్బ తీస్తారు. ఇదంతా ఎలా ఉన్నా ఇరువైపులా హింస సరికాదు. నక్సల్స్ కూడా ప్రజల పక్షాన పోరాడడం మాని కేవలం అడవుల్లోనే ఉంటూ హింసాత్మక ఘటనలతో భీతావాహ పరిస్థితులను సృష్టించారు. నిజంగానే ఇప్పటికైనా నక్సల్స్ ఉంటే వారంతా జనజీవన స్రవంతిలోకి రావాలి. ప్రజల పక్షాన సమస్యలపై పోరాడాలి. ఇకపోతే అసలు ఆపరేషన్ కగార్ చేపట్టిందే హిడ్మా కోసమని, ఆయన కోసం డెడ్‌లైన్ కూడా పెట్టారని, ఆ గడువులోపలే పనిపూర్తయిందని మీడియాలో వస్తున్న కథనాలను చూస్తూనే ఉన్నాం. కేంద్రహోం శాఖ మంత్రి అమిత్‌షా కూడా పదేపదే మార్చి అంటూ టార్గెట్ పెడుతూనే ఉన్నారు. నిజానికి ఇటువంటి అప్రజాస్వామిక, హింసాత్మక విధానాలను ఎవరు అవలంబించినా ఖండించాల్సిందే. ఇకపోతే మరో నక్సల్ నాయకుడు తిప్పిరి తిరుపతి పోలీసుల అదుపులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అదే నిజమైతే పోలీసులు అదుపులోకి తీసుకున్న వారందరినీ తక్షణం న్యాయస్థానాల ముందు హాజరుపర్చాలి. ఇకపోతే రెండు రోజులుగా రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా వరుసగా జరుగుతున్న మావోయిస్టుల ఎన్‌కౌంటర్లు, అరెస్టులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఒక కుదుపు కుదిపాయి. ఎందుకంటే ఇటీవలి కాలంలో ఎపిలో నక్సల్స్‌ఉన్న జాడలేదు. అందుకే ఈ ఎన్‌కౌంటర్లపై సహజంగానే అనుమానాలు రవాడం సహజం. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీప్రాంతంలో మంగళవారం ఉదయం జరిగిన పోలీసు కాల్పుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మా, ఆయన భార్య రాజక్కతో సహా ఆరుగురు మరణించారు. ఈ సంఘటన రేపిన కలకలం చల్లారకముందే, 24 గంటలలోపే బుధవారం ఉదయం దాదాపు అదే ప్రాంతంలో జరిగిన మరో ఘటనలో ఏడుగురు మావో యిస్టులు ప్రాణాలు నేలకొరిగారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వమే మావోయిస్టుల నిర్మూలన కార్యక్రమాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆయుధాలతో సహా బేషరతుగా లొంగిపోవడం తప్ప మరో మార్గంలేదని సాక్షాత్తు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పదేపదే ప్రకటించారు. ఆ హెచ్చరికల నేపథ్యంలోనే ఇవన్నీ సాగుతున్నాయని భావించాల్సిందే. ఆపరేషన్ కగార్ చేపట్టినతరువాత అంతా అయింపోయిందనుకుంటే పొరపాటు. అక్కడ నివసిస్తున్న గిరిజనుల సమస్యలు పరిష్కరించకుండా ముందుకు సాగితే పరిస్థితుల్లో మార్పు రాదని ప్రభుత్వాలు గుర్తించాలి.

# హమాస్ తరహాలో దాడులు.. ఆయుధాల సమీకరణ

- ఆయుధాగారాలుగా ఆస్పత్రుల ఎంపిక
- ఎన్ఐఏ దర్యాప్తులో కుట్రలు వెల్లడి



**న్యూఢిల్లీ, నవంబర్ 21:** ఢిల్లీ పేలుడు ఘటనపై అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా అరెస్టయిన టెర్రర్ వైద్యులను విచారిస్తున్నారు. ఈ విచారణలో వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ కుట్రలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఇజ్రాయెల్‌పై 2023 అక్టోబర్ 7న హమాస్ ఉగ్రవాదులు జరిపిన దాడి తరహాలో ఢిల్లీలోని రద్దీ ప్రదేశాల్లో దాడులకు కుట్ర పన్నినట్లు తేలిన విషయం తెలిసిందే. తాజాగా మరో విషయం వెలుగులోకి వచ్చింది. హమాస్ తరహాలోనే ఆయుధాలను దాచేందుకు ఈ వైట్ కాలర్ ఉగ్ర ముఠా ఆసుపత్రులను ఎంచుకున్నట్లు తేలింది. ఇజ్రాయెల్‌తో యుద్ధం సమయంలో గాజాలోని పలు ఆసుపత్రుల కింద హమాస్ స్థావరాలు బయటపడిన సంగతి తెలిసిందే. పెద్ద ఎత్తున పేలుడు పదర్థాలు, ఆయుధాలను ఆసుపత్రుల కింద డంప్ చేసినట్లుగా ఐడీఎఫ్ గుర్తించింది. అదే తరహాలో జమ్ము ఆసుపత్రుల కింద ఆయుధ డంప్‌ను ఏర్పాటు చేసేందుకు వైట్ కాలర్ టెర్రర్ కుట్ర పన్నినట్లు అధికారులు గుర్తించారు. ఢిల్లీ పేలుడు, ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌తో సంబంధం ఉన్న వైద్యులు మొహమ్మద్ షకీల్, అదిల్ అహ్మద్ రాథర్, షాహీన్ సయీద్‌ను దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్న విషయం తెలిసిందే. వీరిలో షకీల్, షాహీన్ ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. ఇక అహ్మద్ రాథర్ మాత్రం జమ్ము కశ్మీర్ అనంత్‌నాగ్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఉద్యోగి. అతడిని విచారించగా ఈ ఆయుధ డంప్ కుట్ర విషయం బయటపడింది. విదేశాల నుంచి ఇంపోర్ట్ చేసుకున్న ఆయుధాలను దాచేందుకు అనంత్‌నాగ్, శ్రీనగర్, బారాముల్లా, బుద్గాం, నౌగమ్‌లోని ఆసుపత్రులను ఈ ఉగ్ర మాడ్యూల్ పరిశీలించినట్లు దర్యాప్తులో తేలినట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. మరోవైపు ఈ కేసు దర్యాప్తులో హమాస్ తరహాలో డ్రోన్లతో దాడులకు కుట్ర పన్నినట్లు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఎర్ర కోట వద్ద ఈ నెల 10న ఆత్మాహుతి దాడికి ముందు ఈ ఉగ్ర ముఠా భారీ ఆయుధాలతో కూడిన డ్రోన్లతో రద్దీ ప్రదేశాల్లో దాడులు చేయాలని ప్రణాళిక రచించింది. ఇజ్రాయెల్‌పై 2023 అక్టోబర్ 7న హమాస్ ఉగ్రవాదులు జరిపిన దాడి తరహాలో దాడులకు పాల్పడాలని వీరు ప్రయత్నించారు. సూసైడ్ బాంబర్, డాక్టర్ ఉమర్ ఉన్ నబీతో కలిసి పని చేసిన జసిర్ బిలాల్ వానీ వురపు డానిష్ ఈ భయానక వివరాలను వెల్లడించాడు. ఇతనిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) బృందం శ్రీనగర్‌లో అరెస్ట్ చేసింది. కారు బాంబు పేలుడుకు ముందే, డ్రోన్లకు భారీ ఆయుధాలను అమర్చి, రాకెట్లను తయారు చేసి, రద్దీ ప్రదేశాల్లో దాడులకు పాల్పడేందుకు సాంకేతిక సహకారాన్ని డానిష్ అందించాడని ఎన్ఐఏ ఓ ప్రకటనలో తెలిపింది. సూసైడ్ బాంబర్ ఉమర్‌తో సహ కుట్రదారుగా డానిష్ పని చేసినట్లు తెలిపింది. మీడియా కథనాల ప్రకారం, పెద్ద బ్యాటరీలతో అత్యంత శక్తిమంతమైన బాంబులను తీసుకెళ్లగలిగే డ్రోన్లను తయారు చేయడానికి డానిష్ ప్రయత్నించాడు. ఆయుధాలతో కూడిన డ్రోన్లను తయారు చేయడంలో అతనికి అనుభవం ఉంది. రద్దీ ప్రదేశాల్లో డ్రోన్ల దాడి చేయాలని నిందితులు ప్రయత్నించారు.

# ఢిల్లీలో ప్రమాదకరంగా గాలి కాలుష్యం


**మరింతగా క్షీణించినట్లు గుర్తింపు**
**స్పోర్ట్స్ యాక్టివిటీస్‌పై నిషేధం విధింపు**
**ప్రజలను హెచ్చరించిన అధికారులు**



**న్యూఢిల్లీ, నవంబర్ 21:** ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలకు చేరుకుంది. పలు ప్రాంతాల్లో పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. గత నెల ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతాల్లోని 80 శాతం ఇళ్లలో విషపు గాలి కారణంగా కనీసం ఒక సభ్యుడు అనారోగ్యానికి గురైనట్లు సర్వేలు చెబుతున్నాయి. గాలి కాలుష్యం కారణంగా ప్రజల ఆయుర్దాయంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కూడా పూర్తి స్థాయిలో ప్రజలకు రక్షణ లభించటం లేదు. మాస్కులు, ఎయిర్ ప్యూర్గి÷యైర్లు కొంత మేరకు మాత్రమే రక్షణ ఇస్తాయని, కాలుష్యాన్ని నియంత్రించడానికి పాలసీలో మార్పులు రావాలని వైద్యులు సూచిస్తున్నారు. కాలుష్యం తీవ్ర స్థాయికి చేరుకున్న నేపథ్యంలో ఢిల్లీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. స్పోర్ట్స్ యాక్టివిటీస్‌పై నిషేధం విధించింది. ఢిల్లీలో కాలుష్యం పెరుగుతుండటంతో స్పోర్ట్స్ యాక్టివిటీస్ ఆపేయాలని రెండు రోజుల క్రితం దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తం అయింది. సాధారణంగా ఢిల్లీలోని స్కూల్స్ చలికాలంలో స్పోర్ట్స్ మీట్స్ కండక్ట్ చేస్తూ ఉంటాయి. కాలుష్యం పెరగటంతో నవంబర్, డిసెంబర్ నెలలో నిర్వహించే క్రీడలను నిర్వహించొద్దని ఢిల్లీ ప్రభుత్వం స్కూళ్లను ఆదేశించింది. ఇకపోతే ఢిల్లీలో గాలి నాణ్యతలు క్షీణించాయి. ఢిల్లీలో కొన్ని ప్రాంతాల్లో ప్రమాదకర స్థాయిలో గాలి నాణ్యతలు నమోద్యాయి. దీంతో ఆ గాలి ప్రాణాంతకంగా మారుతుందని పలువురు నిపుణులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని ప్రాంతంలో 80 శాతం నివాసితులు గాలి నాణ్యతలు క్షీణించడం వల్ల అనారోగ్యాలపాలవుతున్నారు. కనీసం కుటుంబంలో ఒక్కరైనా శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని పలు సర్వేలు వెల్లడించాయి. మాస్కులు, ఎయిర్ ప్యూర్గి÷యైర్‌లు కొంత రక్షిస్తున్నప్పటికీ.. ఈ సమస్యను పరిష్కరించడానికి ఏడాది పొడవునా కచ్చితమైన విధాన మార్పు అవసరమని వైద్యులు సూచించారు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయానికి ఎక్యూఐ 370 స్థాయి వద్ద నమోదైంది. దీంతో వీటి స్థాయిల్ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెరీపూర్ కేటగిరీలో వర్గీకరించింది. ఢిల్లీలో కొన్ని ప్రాంతాల్లో ఎక్యూఐ తీవ్ర స్థాయిలో నమోదైంది. చాందినీ చౌక్, ఆనంద్ విహార్, ముండ్కా, బవానా, నరేలా, డిటియు- వజీర్‌పూర్‌లలో 400కి పైగా ఎక్యూఐ నమోదైంది. 18 పర్యవేక్షణా కేంద్రాల్లో 400 పైగానే ఎక్యూఐ నమోదైంది. గత కొన్ని రోజుల్లోనే కాకుండా.. వచ్చే వారంలో ఆరు రోజులు కూడా తీవ్ర ప్రమాదకర స్థాయిలోనే గాలి నాణ్యతలు నమోదయ్యే అవకాశం ఉందని భూశాస్త్రాల మంత్రిత్వశాఖ అంచనా వేసింది. గాలి కదలికలు సరిగ్గా లేకపోవడం, శీతాకాలం కారణంగా గాలి నాణ్యతలు ప్రమాదకర స్థాయిలో నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఢిల్లీలో గాలి ఎంత కాలుష్యంగా ఉందో నెట్టింట వైరల్ అవుతున్న ఫొటోలే నిదర్శనం. దేశ రాజధానిలో వాయు కాలుష్యం పెరిగిపోవటానికి పంట వ్యర్థాలను తగలబెట్టడం ప్రధాన కారణం అవుతోంది. ఢిల్లీ చుట్టు పక్కల ఉండే రాష్ట్రాల ప్రజలు పెద్ద సంఖ్యలో పంట వ్యర్థాలను తగలబెడుతూ ఉన్నారు. దాని కారణంగా ఢిల్లీలో కాలుష్యం పెరుగుతోంది. అధికారులు పోలీస్ కేసులు నమోదు చేస్తున్నా.. భారీ ÷న్లు వేస్తున్నా కూడా రైతులు మారటం లేదు. పంట వ్యర్థాలను కాలుస్తూనే ఉన్నారు.

# దుబాయ్ ఎయిర్ షోలో ప్రమాదం


**ప్రదర్శన సమయంలో కుప్పకూలిన తేజస్ యుద్ధ విమానం**



**న్యూఢిల్లీ, నవంబర్ 21:** దుబాయ్‌లో జరుగుతున్న ఎయిర్ షోలో ప్రమాదం చోటు చేసుకుంది. భారత్‌కు చెందిన తేజస్ యుద్ధ విమానం కూలిపోయింది. ఎయిర్ షోలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ప్రదర్శన జరుగుతుండగా.. విమానం ఒక్కసారిగా కూలిపోయింది. ఆ వెంటనే పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా భయాందోళనకర వాతావరణం నెలకొంది. పైలట్ ప్రమాదం నుంచి బయటపడ్డాడా? లేదా? అన్నది స్పష్టంగా తెలియలేదు. కానీ, ప్రమాద తీవ్రతను చూస్తుంటే పైలట్ బతికే ఛాన్స్ లేదనే తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కూడా ఇంకా ఎలాంటి ప్రకటనా చేయలేదు. కాగా, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈ యుద్ధ విమానాన్ని బెంగళూరులోని హిందూస్తాన్ ఎరోనాటికల్ లిమిటెడ్ తయారు చేసింది.

# బంగ్లాదేశ్‌లో భూ ప్రకంపనలు

**కోల్‌కతా పరిసరాల్లోనూ ప్రభావం**



**ఢాకా, నవంబర్ 21:** పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో భారీ భూప్రకంపనలు సంభవించాయి. రిక్టర్ స్కేలుపై భూప్రకంపనల తీవ్రత 5.2 మాగ్నిట్యూడ్‌గా నమోదు అయింది. శుక్రవారం ఉదయం 10 గంటల 8 నిమిషాల ప్రాంతంలో ఘోరాశల్ దగ్గర భూప్రకంపనలు సంభవించాయి. యునైటెడ స్టేట్స్ జియోలాజికల్ సర్వే ప్రకారం.. నార్సింగ్దికి 14 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉంది. ఇక, బంగ్లాదేశ్‌లో భూకంపం రావటంతో కోల్‌కతాతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో భూమి స్వల్పంగా కంపించింది. ఇళ్లలోని ఫ్యాన్లతో పాటు ఇతర వస్తువులు అటు, ఇటు ఊగాయి. దీంతో జనం భయపడిపోయారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పెద్ద సంఖ్యలో జనం వీధుల్లోకి వచ్చి చేరారు. అయితే, భూ ప్రకంపనల కారణంగా ఎవరైనా చనిపోయారా? లేక గాయాలు అయ్యాయా? అన్న దానిపై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. భూ ప్రకంపనలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియ రావాల్సి ఉంది. బంగ్లాదేశ్‌లో భూ ప్రకంపనలకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఓ వీడియోలో ఢాకాలోని బద్దా లింక్ రోడ్ ఏరియాలోని ప్రజలు పెద్ద సంఖ్యలో వీధిలోకి వచ్చి నిలబడ్డారు. పక్కన ఉన్న అపార్ట్‌మెంట్స్ స్వల్పంగా కంపిస్తూ ఉన్నాయి. జనం భయంభయంగా అటు, ఇటు చూస్తూ ఉన్నారు. కొంతమంది వాటిని వీడియో తీస్తూ ఉన్నారు.




# అల్ ఫలా యూనివర్శిటీ కార్యకలాపాలపై నిఘా

**ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ఏర్పాటు చేస్తూ ఆదేశం**

**న్యూఢిల్లీ, నవంబర్ 21:** అల్ ఫలా యూనివర్శిటీ కార్యకలాపాలపై నిఘా కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్)ను ఏర్పాటు చేసినట్లు ఫరీదాబాద్ పోలీసులు శుక్రవారం తెలిపారు. ఇద్దరు అసిస్టెంట్ కమిషనర్స్ ఆఫ్ పోలీస్, ఇన్‌స్పెక్టర్ మరియు ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లతో కూడిన సిట్‌యూనివర్శిటీ కార్యకలాపాలపై సమగ్ర నివేదికను రూపొందిస్తోందని అన్నారు. ఫరీదాబాద్‌లోని అల్ ఫలా యూనివర్శిటీ వ్యవహారాలను దర్యాప్తు చేయడానికి సిట్‌ను ఏర్పాటు చేశామని, అన్ని అంశాలను పరిశీలిస్తున్నామని ఫరీదాబాద్ పోలీస్ ప్రతినిధి తెలిపారు. ఈ కేసుకు సంబంధించి యూనివర్శిటీకి చెందిన పలువురు వైద్యులను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.ర్యాప్తు సంస్థలు క్యాబ్ డ్రైవర్, మతాధికారి, ఉర్దూ ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. క్యాబ్ డ్రైవర్ ధౌజ్ గ్రామానికి చెందినవారు కాగా, మిగిలిన ఇద్దరు నుహ్ జిల్లాకు చెందిన వారని పేర్కొన్నాయి. సోహ్నా సమీపంలోని రాయ్‌పూర్ గ్రామంలోని షాహిజామా మసీదు నుండి వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి.

# శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి

**తిరుమల, నవంబర్ 21:** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. గురువారం రాత్రి తిరుమలకు చేరుకున్న రాష్ట్రపతి శుక్రవారం ఉదయమే దర్శనం చేసుకున్నా ఆలయ మహాద్వారం వద్ద ఆమెకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈ ఓవో అనిల్ కుమార్ సింఘాల్, అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు ఆమెకు వేదాశీర్వచనాలిచ్చి తీర్థప్రసాదా లను అందజేశారు. రాష్ట్రపతికి స్వామివారి చిత్రపటాన్ని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అందించారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆలయం నుంచి పద్మావతి అతిథి గృహానికి బయలుదేరారు. దారి మధ్యలో రాంభగీచ వసతిగృహం వద్ద వాహనం దిగి అక్కడి భక్తులతో మాట్లాడారు. వారికి చాక్లెట్లు కూడా పంచారు. రాష్ట్రపతి రాకతో తిరుమలలో భారీగా భద్రత కల్పించారు.

# రానున్న మూడేళ్లలో 17 లక్షల ఇళ్ల నిర్మాణం

మొదటి పేజీ తరువాయి



మాట్లాడుతూ.. "ఎన్నికల్లో ఇచ్చిన 'హౌసింగ్ ఫర్ ఆల్' హామీని నెరవేర్చే ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. ఇప్పటికే 3 లక్షలకు పైగా ఇళ్లలో సామూహిక గృహప్రవేశాలు చేయించాం. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసి 2029 జనవరి నాటికి పూర్తి చేయాలి. కూటమి ప్రభుత్వం మొత్తం 20 లక్షల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మిగిలిన 17 లక్షల ఇళ్లను వచ్చే మూడేళ్లలో పూర్తి చేయాలి. దీనిలో భాగంగా వచ్చే ఉగాది నాటికి 5 లక్షల ఇళ్ల సామూహిక గృహప్రవేశాలు జరగాలి" అని దిశానిర్దేశం చేశారు. ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ దీనిని బాధ్యతగా తీసుకోవాలని, త్వరలోనే టిడ్కో, గృహనిర్మాణ శాఖల సిబ్బందితోనూ సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు.

**ప్రజల సంతృప్తే ముఖ్యం**

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని సీఎం స్పష్టం చేశారు. "ప్రస్తుతం జరుగుతున్న లబ్ధిదారుల సర్వేను వేగంగా పూర్తి చేసి, అర్హుల జాబితాను గ్రామాల్లో ప్రదర్శించాలి. ప్రజలు తృప్తి చెందితేనే నాకు సంతృప్తి. లబ్ధిదారులు స్థలం కావాలని కోరితే కేటాయించండి... సొంత స్థలం ఉన్నవారికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వండి. ప్రతి వివరమూ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండాలి" అని చంద్రబాబు ఆదేశించారు.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఇస్తున్న అదనపు సాయాన్ని ఇకపై ముస్లిం మైనార్టీలకు కూడా వర్తింపజేస్తామని ప్రకటించారు. దీని ద్వారా 18 వేల మంది ముస్లిం మైనార్టీ లబ్ధిదారులకు అదనంగా రూ. 50 వేల చొప్పున సాయం అందుతుందని, దీనికి రూ. 90 కోట్లు అవసరమవుతాయని వివరించారు.

**పెండింగ్ బిల్లులపై కేంద్రంతో సంప్రదింపులు**

గత ప్రభుత్వ కక్షసాధింపు చర్యల వల్ల 2014-19 మధ్య కాలంలో నిర్మించిన ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించిన రూ. 920 కోట్ల బిల్లులు నిలిచిపోయాయని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. "గత ప్రభుత్వం ఏ విధంగా ఈ బిల్లులను అడ్డుకుందో కేంద్రానికి వివరించి, వాటిని తిరిగి రాబట్టేందుకు సంప్రదింపులు జరపండి. గతంలో నరేగా పనులకు సంబంధించి ఆగిపోయిన బిల్లులను కూడా ఇదే తరహాలో తిరిగి వచ్చేలా చేశాం. అదే పద్ధతిలో ఈ హౌసింగ్ బిల్లులను కూడా సాధించాలి" అని అధికారులను ఆదేశించారు. 2014-19 మధ్య 8 లక్షల ఇళ్లు, 2019-24 మధ్య 5.80 లక్షల ఇళ్లు నిర్మించినట్లు అధికారులు ఈ సమావేశంలో వివరించారు. ఈ సమీక్షలో గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో పాటు టిడ్కో, హౌసింగ్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సీసీఐ అధికారుల తీరుపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం

**అమరావతి :** రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల విషయంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకున్నప్పటికీ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయంపై ఆయన మండిపడ్డారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పత్తి రైతులు నష్టపోవడానికి వీల్లేదని, వారిని ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని ఆయన తేల్చి చెప్పారు. ఈ విషయంపై తక్షణమే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రైతులకు సంబంధించిన ఏ విషయంలోనూ నిర్లక్ష్యం తగదని అధికారులకు ఆయన గట్టిగా హెచ్చరించారు. ఈ సమీక్షలో కేవలం పత్తి రైతుల సమస్యలకే పరిమితం కాకుండా, వ్యవసాయ రంగంలోని ఇతర కీలక అంశాలపై కూడా ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆన్‌లైన్ ద్వారా ఈ సమావేశానికి హాజరైన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఇతర ఉన్నతాధికారులతో ఆయన పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఏర్పాటు చేస్తున్న ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు ఆదేశించారు. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించడం (వాల్యూ అడిషన్) ద్వారానే రైతులకు గరిష్ఠ ప్రయోజనం చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు.

**'రైతన్నా-మీకోసం' కార్యక్రమంలో నేనూ పాల్గొంటా!**

ఈ నెల 24 నుంచి 29 వరకు, తిరిగి డిసెంబరు 3న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న 'రైతన్నా-మీకోసం' కార్యక్రమంలో తాను కూడా స్వయంగా పాల్గొంటానని ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా ఈ కార్యక్రమాల్లో పాల్గొని రైతుల వద్దకు వెళ్లాలని సూచించారు. రైతు భరోసా కేంద్రం పరిధిలోని ప్రతి రైతు ఇంటికీ ముఖ్యమంత్రి లేఖను అందించి, ప్రభుత్వం నిర్దేశించిన పంచ సూత్రాలను వివరించాలని ఆదేశించారు. నీటి భద్రత, డిమాండ్‌కు తగిన పంటల సాగు, అగ్రిటెక్ వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ పథకాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని నిర్దేశించారు.

**సాంకేతికత రైతుకు చేరువ కావాలి**

వ్యవసాయ శాఖ రూపొందించిన 'ఫార్మర్ యాప్'ను ప్రతి రైతు ఫోన్‌లో ఉండేలా చూడాలని సీఎం సూచించారు. పంట సాగు వివరాలు, వాతావరణ సలహాలు, మార్కెట్ ధరలు, భూసార పరీక్షల వంటి సమాచారాన్ని రియల్ టైంలో అందిస్తేనే రైతులకు ప్రయోజనం ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు అందిస్తున్న సేవలను కొనియాడిన సీఎం, ప్రభుత్వ కార్యక్రమాలను రైతుల వద్దకు తీసుకెళ్లడంలో వారు కీలకపాత్ర పోషించాలని అన్నారు.

**అరటి రైతులకు అండగా ఉండాలి**

అనంతపురం, కడప, నంద్యాల జిల్లాల్లో అరటి ధరలు పడిపోవడంపై సీఎం ఆరా తీశారు. ఇతర రాష్ట్రాల్లో ఉత్పత్తి పెరగడం, వర్షాల వల్ల ఎగుమతి రకం దెబ్బతినడంతో ధరలు తగ్గాయని అధికారులు వివరించగా, తక్షణమే మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించి మద్దతు ధర లభించేలా చూడాలని ఆదేశించారు. పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేయడంతో పాటు, అవసరమైతే జల, రైలు, ఎయిర్ కార్గో ద్వారా ఉత్పత్తులను రవాణా చేయడానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# దుబాయ్ ఎయిర్ షోలో కుప్పకూలిన తేజస్

మొదటి పేజీ తరువాయి



అతిపెద్ద ఏవియేషన్ ప్రదర్శనలలో ఒకటైన దుబాయ్ ఎయిర్ షోలో ఏరియల్ డిస్‌ప్లే ఇస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. తేజస్ యుద్ధ విమానానికి సంబంధించి ఇది రెండో ప్రమాదం కావడం గమనార్హం. 2001లో తొలిసారి గాల్లోకి ఎగిరినప్పటి నుంచి సుమారు 23 ఏళ్ల చరిత్రలో మొదటి ప్రమాదం 2024 మార్చిలో రాజస్థాన్‌లోని జైసల్మేర్ సమీపంలో జరిగింది. అయితే ఆ ఘటనలో పైలట్ సురక్షితంగా బయటపడ్డారు. తేజస్ 4.5వ తరం, అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో పనిచేయగల మల్టీ-రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్. ఇది వైమానిక దాడులు, క్లోజ్ కంబాట్, భూమిపై దాడి వంటి పలు రకాల పాత్రలను సులభంగా నిర్వహించగలదు. ఈ దుర్ఘటనతో దుబాయ్ ఎయిర్ షోలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# గురుకుల పాఠశాలలో విషాదం

## ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

**ఏలూరు :** ఏలూరు జిల్లాలోని జంగారెడ్డిగూడెంలో విష్యాదం అలముకుంది. తరగతి గదిలోనే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెం మండలం జొన్నవారిగూడెం గ్రామానికి చెందిన పొడపాటి కావ్య (15).. జంగారెడ్డిగూడెం పట్టణంలోని గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. శుక్రవారం పాఠశాలలో భోజన విరామ సమయంలో విద్యార్థులందరూ భోజనం చేసేందుకు వెళ్లగా.. ప్లేట్ తెచ్చుకునేందుకు కావ్య తిరిగి తరగతి గది వద్దకు వెళ్లింది. భోజనం చేసేందుకు కావ్య ఎంతకీ రాకపోవడంతో.. తీసుకొచ్చేందుకు తోటి విద్యార్థులు వెళ్లారు. అయితే కావ్య.. తరగతి గదిలో చున్నీతో ఫ్యానుకు ఉరివేసుకొని ఉండడాన్ని గమనించి కేకలు వేశారు. వెంటనే స్పందించిన ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే విద్యార్థిని మృతి చెందిందని వైద్యులు నిర్ధరించారు. ఘటనా స్థలాన్ని జంగారెడ్డిగూడెం సీఐ సుభాష్, ఎస్సై వీరప్రసాద్ పరిశీలించారు. తోటి విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. కావ్య తండ్రి గంగాధర్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తల్లి ఉష డయాలసిస్ పేషెంట్ కావడంతో కొంతకాలంగా చికిత్స పొందుతున్నారు. విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

# నాగార్జున సాగర్ కుడికాలువకు గండి

## అధికారులను అప్రమత్తం చేసిన మంత్రులు

## యుద్ధ ప్రాతిపదికన గండి పూడ్చివేత చర్యలు

**అమరావతి :** నాగార్జున సాగర్ కుడికాలువ గండిపై ఇరిగేషన్ అధికారులను మంత్రి నిమ్మల రామానాయుడు అప్రమత్తం చేశారు. సమీప గ్రామాల్లోకి నీరు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు చెప్పారు. గండి పడటానికి గల కారణాలను నివేదిక రూపంలో అందించాలని ఇరిగేషన్ అధికారులను మంత్రి నిమ్మల ఆదేశించారు. అధికారులు యుద్ధ ప్రాతిపదికన గండి పూడ్చుతున్నారు. ఆందోళన వద్దని గ్రామస్తులకు సూచిస్తున్నారు. మధ్యాహ్నం కల్లా గండి పూడ్చివేత పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. అలాగే పల్నాడు జిల్లాలో నాగార్జునసాగర్ కుడికాలువ కట్టకు గండి పడిన ఘటనపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. అధికారులు అప్రమత్తమై నష్టాన్ని గణనీయంగా తగ్గించారని పేర్కొన్నారు. గండిని పూడ్చేయటంతో ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ఇకపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పల్నాడు జిల్లాలో నాగార్జునసాగర్ కుడికాలువ కట్టకు గురువారం అర్ధరాత్రి గండిపడింది. ఎస్కేప్ ఛానల్ వద్ద కట్టకు గండి పడటంతో నాగులేటి వాగుకు ప్రవాహం పెరిగింది. దీంతో వాగు పరీవాహక ప్రాంత ప్రజలు భయాందోళన చెందారు. ఈక్రమంలో అధికారులు అప్రమత్తమై శుక్రవారం ఉదయం గండిని పూడ్చారు.నాగార్జున సాగర్ కుడికాలువ కట్టకు గండి పడింది. కారంపూడి ఎస్కేప్ ఛానల్ వద్ద అర్ధరాత్రి వేళ కట్టకు గండి పడింది. కాలువకు గండి పడటంతో నాగులేటి వాగుకు ప్రవాహం అంతకంతకూ పెరుగుతూ పోతోంది. వీరుల తిరునాళ్లలో ఏర్పాటు చేసిన దుకాణాల్లోకి నీరు చేరింది. వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో సమీప ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలీక బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. సమాచారం అందుకున్న స్థానిక అధికారులు హుటాహుటిన గండిపడ్డ చోటుకు చేరుకున్నారు. గండిని పూడ్చే పనులు చేపట్టారు. ప్రాజెక్టు వద్దే నీటిని నిలుపుదల చేయాల్సి ఉందని స్థానిక అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తులు కట్టను ధ్వంసం చేసి ఉండొచ్చని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# ఉపరితల ఆవర్తన ప్రభావం

## రాష్ట్రంలో పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు

**అమరావతి :** వాతావరణంలో నెలకొన్న పరిస్థితుల ప్రభావంతో ఏపీలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారంకి దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు. ఇది పశ్చిమ - వాయవ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి దక్షిణ బంగాళాఖాతం మధ్య ప్రాంతాల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆ తర్వాత 48 గంటల్లో పశ్చిమవాయవ్య దిశగా కదులుతూ నైరుతి బంగాళాఖాతంలో మరింత బలపడే అవకాశం ఉందని వివరించారు. దీంతో ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శనివారం ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు పేర్కొన్నారు. వర్షాల దృష్ట్యా ప్రజలు, రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# కృష్ణా జలాల హక్కుల పరిరక్షణలో ప్రభుత్వం వైఫల్యం

మొదటి పేజీ తరువాయి



తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని, తెలంగాణ రాష్ట్రానికి కృష్ణా నదిలో 763 టీఎంసీలను కేటాయించేందుకు ట్రిబ్యునల్ అంగీకరిస్తే ఏపీకు తీవ్ర అన్యాయం జరుగుతుందని.. ఈ నేపథ్యంలో రాష్ట్ర రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభుత్వం తమ వాదనలు వినిపించాలని లేఖలో జగన్ కోరారు. 'రాయలసీమ ప్రాజెక్టులపై టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.. 1996లో చంద్రబాబు ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అల్మట్టి ప్రాజెక్టు ఎత్తును 519.6 మీటర్ల నుంచి 524.25 మీటర్లకు పెంచే పనులు ప్రారంభమయ్యాయి. ఆ సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిపక్షాలు, రైతులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అల్మట్టి ఎత్తు పెంపు వలన ఏపీ హక్కులకు ముప్పు ఏర్పడుతుంది. దీనిపై అప్పట్లో ఎన్ని ఆందోళనలు చేసినా చంద్రబాబు పట్టించుకోలేదు. ప్రజాభిప్రాయాన్ని రైతుల ఆందోళనలను ఖాతరు చేయలేదు. టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఆల్మట్టి ఎత్తు పెంపునకు అనుమతి ఇచ్చింది. అంతేకాదు 2014లో ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం కృష్ణా నదిపై ఏపీ హక్కులను తెలంగాణకు పూర్తిగా వదిలేసింది. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు సీఎంగా ఉన్న తరుణంలోనే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్లిష్ట పరిస్థితిలో టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్ర హక్కులను సమర్థంగా కాపాడాలి. బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 512 టీఎంసీల నికర నీటిలో ఒక్క టీఎంసీ తగ్గినా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుంది. దీనికి చంద్రబాబు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి' అని వైఎస్ జగన్ లేఖలో రాసుకొచ్చారు.

# టెన్త్ పరీక్షల తేదీలు విడుదల

## మార్చి 16వ నుంచి ఏప్రిల్ 1వ వరకు షెడ్యూల్

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ పదోతరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలయ్యింది. ఈమేరకు రాష్ట్ర ఎస్ఎస్‌సీ బోర్డు వివరాలను వెల్లడించింది. 2026 మార్చి 16వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఏపీ టెన్త్ ఎగ్జామ్స్ జరుగనున్నాయి. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని ప్రకటించింది. 16న ఫస్ట్ లాంగ్వేజ్, 18న సెకెండ్ లాంగ్వేజ్, 20న ఇంగ్లీష్, 23న మ్యాథ్స్, 25న భౌతికశాస్త్రం, 28న జీవశాస్త్రం, 30న సాంఘిక శాస్త్రం, 31న ఫస్ట్ లాంగ్వేజ్ (పేపర్2), ఏప్రిల్ 1న సెకెండ్ లాంగ్వేజ్ పేపర్2 పరీక్షలు జరుగుతాయని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ఏపీ ఎస్ఎస్‌సీ బోర్డు అధికారులు ఇవాళ(శుక్రవారం) ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు అధికారులు.

# మత్స్యకారులను మోసం చేసిన గత ప్రభుత్వం


మొదటి పేజీ తరువాయి

మత్స్యకార దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత్స్యకారులందకీ కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయుడు తరపున శుభాకాంక్షలు తెలిపారు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు. రాష్ట్రంలో సుదీర్ఘమైన 1,100 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని.. అందులో శ్రీకాకుళం జిల్లాకు 193 కిలోమీటర్ల తీరం ఉందని వివరించారు. టీడీపీ ఆవిర్భవించి 42 సంవత్సరాలు అయిందని గుర్తుచేశారు. నాటి నుంచి నేటి వరకు టీడీపీ మత్స్యకారులకు అండగా ఉందని తెలిపారు. ఏపీలో మత్స్యకారులకు పెద్దపీట వేసింది టీడీపీ ప్రభుత్వమేనని చెప్పుకొచ్చారు. 50 సంవత్సరాలకే వారికి పింఛన్ ఇచ్చింది తెలుగుదేశం ప్రభుత్వమని గుర్తుచేశారు. ఏ తుఫాన్ వచ్చినా మత్స్యకారులకు 50 కేజీల ఉచిత బియ్యం ఇస్తున్నామని వివరించారు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు. గత ఐదు సంవత్సరాల్లో వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులకు చేసిందేమీ లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి మత్స్యకారులకు వలలు, బోట్లకి సబ్సిడీ ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. సీ కోస్ట్ అంతా సోలార్ విద్యుత్ స్తంభాలు వేయించామని అన్నారు. మూలపేటలో పోర్టు తయారవుతుందని.. బుడగట్లపాలెంలో జట్టీ ఏర్పాటు చేస్తామని వివరించారు. మంచినీళ్లపేటలో ఫిష్ ల్యాండ్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి రిక్వెస్ట్ పెట్టామని.. మత్స్యకారులంతా తమ కుటుంబసభ్యులుగా భావిస్తున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# విశాఖ భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

## సమగ్ర భూ సర్వే అంశాలపై అధికారులతో సమీక్ష

## శాసనసభపక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్ రఘురామ కృష్ణరాజు



**విశాఖపట్నం :** విశాఖపట్నంలో భూ సంబంధిత సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, రాష్ట్ర శాసనసభపక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్ రఘురామ కృష్ణరాజు సూచించారు. శుక్రవారం విశాఖపట్నం కలెక్టరేట్‌లో సమగ్ర భూ సర్వే అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు రఘురామ కీలక సూచనలు చేశారు. ఈ సమావేశానికి సభ్యులు కొణతాల రామకృష్ణ, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, శాసన సభ డిప్యూటీ సెక్రటరీ రాజ్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగ కమిషనర్ ఆర్. కూర్మనాథ్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, విశాఖ, భీమిలి ఆర్డీవోలు సుధాసాగర్, సంగీత్ మాధుర్, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘురామ కృష్ణంరాజు మాట్లాడారు. విశాఖపట్నంలో భూముల రీసర్వేలో ప్రజల నుంచి వస్తున్న ఇబ్బందులపై చర్చించినట్లు తెలిపారు. రీసర్వేలో తమ కమిటీకి స్థానికుల నుంచి పలు ఫిర్యాదులు వచ్చాయని.. వీటిని పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రీసర్వేలో తమ కమిటీ కొన్ని సూచనలు చేసిందని తెలిపారు. భూ సమస్యలను రీసర్వే ద్వారా పరిష్కరించడానికి ఒక సంవత్సరం గడువు పెంచమని ప్రభుత్వానికి సూచించామని అన్నారు. ప్రజలు గందరగోళానికి గురికాకుండా పారదర్శకమైన రీతిలో రీ-సర్వే జరగాలని రఘురామ రాజు ఆదేశించారు. భూముల రీసర్వేను 6,688 గ్రామాల్లో పూర్తి చేశామని ఏపీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డుల విభాగం డైరెక్టర్ ఆర్. కూర్మనాథ్ తెలిపారు. రీసర్వేలో 7 లక్షల ఫిర్యాదులు వచ్చాయని.. 3 లక్షల కేసులు పరిష్కరించలేనివిగా ఉన్నాయని వివరించారు. ఇప్పటికే ప్రజల నుంచి వచ్చిన రెండు లక్షల ఫిర్యాదులను పరిష్కరించామని చెప్పుకొచ్చారు. 7200 గ్రామాల్లో రీసర్వే చేయాల్సి ఉందని కూర్మనాథ్ పేర్కొన్నారు.

## రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ చైర్ పేర్సిన సీత దయాకర్ రెడ్డి అధికాబాద్ జిల్లా పర్యటన.



**ఆదిలాబాద్ నవంబర్21( సమయం న్యూస్) :** పిల్లల హక్కుల సంరక్షణ, రక్షణ, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై శుక్రవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీత దయాకర్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, నిర్మల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, విద్యా, సంక్షేమ, వైద్యారోగ్య, పోలీసు శాఖల అధికారులు, సభ్యులు, ఇతర సంబంధిత విభాగాల ప్రతినిధులు హాజరయ్యారు.

## క్రీడా ప్రతిభను వెలికితీయడానికి క్రీడా సంస్థలు ముందుకు రావడం అభినందనీయం

- పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు, నవంబర్ 21 (సమయం న్యూస్):** గ్రామ స్థాయి నుంచే క్రీడా ప్రతిభను వెలికితీయడానికి క్రీడా సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండల పరిధిలోని భానూరు గ్రామంలో ఆర్కే స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-14, అండర్-17 కబడ్డీ పోటీలను పటాన్ చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచే క్రీడా ప్రతిభను వెలికితీయడానికి క్రీడా సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ విజయ్ కృష్ణ, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గోపాల్, పోటీల నిర్వాహకులు రామకృష్ణ రెడ్డి పాల్గొన్నారు. పోటీలలో పాల్గొనే ఆటగాళ్లకు ప్రజాప్రతినిధులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

## గృహప్రవేశంలో పాల్గొన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి



**బొంరస్ పేట మండలం, నవంబర్,21(సమయం న్యూస్) :** కొడంగల్ నియోజకవర్గం బొంరాస్ పేట్ మండల్ నందర్ పూర్ గ్రామ మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి నూతన గృహప్రవేశం కార్యక్రమం కు ఆజరైన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, కొడంగల్ మున్సిపల్ తాజా మాజీ కౌన్సిలర్ ఆర్ మధుసూదన్ యాదవ్, బొంరాస్ పేట్ మండల మాజీ అధ్యక్షులు కోట్ల యాదగిరి, విష్ణు వర్ధన్ రెడ్డి, శేరి నారాయణ రెడ్డి, మహేందర్ రెడ్డి,చంద్ పాషా, దుద్యాల నరేష్ గౌడ్, దౌల్తాబాద్ మాజీ జెడ్పిటిసి కోట్ల మహిపాల్, లగచర్ల సురేష్, వి రవీంద్ర చారీ, సురేందర్, తదితరులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు

## జిల్లా కలెక్టర్ తో శిక్షణ డిప్యూటీ కలెక్టర్ భేటీ



**ఖమ్మం నవంబర్ 21 : ( సమయం న్యూస్ ) :** డిప్యూటీ కలెక్టర్ గా శిక్షణ నిమిత్తం ఖమ్మం జిల్లాకు నియమించిన యం. అపూర్వ శుక్రవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ని కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి , భేటీ అయ్యారు . ఈ సందర్భంగా ఆమె జిల్లా కలెక్టర్ కు పూలమొక్కను అందించారు.

# మత్స్యకారులు దళారులను నమ్మి మోసపోవద్దు

**బాన్సువాడ, నవంబర్ 21 (సమయం న్యూస్) :** వర్ని మండలం జలాల్‌పూర్ పెద్ద చెరువులో ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన చేప పిల్లల విడుదల కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, అగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు హాజరయ్యారు. మత్స్యకార దినోత్సవం సందర్భంగా పోచారం మాట్లాడుతూ రాష్ట్రంలో 100 శాతం సబ్సిడీతో చేప విత్తనం అందించే విధానం దేశంలో ప్రత్యేకమైందని తెలిపారు. గతంలో ఆర్థిక ఇబ్బందులతో మత్స్యకారులు దళారులపై ఆధారపడే పరిస్థితి ఉండేదని, దాంతో లాభాలు దళారులకే చేరేవని పేర్కొన్నారు. మత్స్యకారులు స్వయంగా గ్రామాలు, పట్టణాల్లో చేపలను అమ్మే విధానాన్ని అవలంభించాలని సూచించారు. దళారుల ఆధారాన్ని తగ్గించాలని, దోపిడీకి గురికాకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయ స్వామి, ఫిషరీస్ మాజీ అదనపు డైరెక్టర్ శంకర్ నాయక్ రాథోడ్, వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా పాల్గొన్నారు.



# వయోవృద్ధుల సంక్షేమ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

• జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల నవంబర్ 21,( సమయం న్యూస్).:** వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, డిసిపి ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్,, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వయోవృద్ధులకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టంపై వృద్ధులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఫిర్యాదుదారులకు రక్షణ కల్పించడానికి ఎవరూ లేని పక్షంలో ఓల్డ్ ఏజ్ హోమ్స్/ స్వచ్ఛంధ సంస్థల సహాయంతో సంరక్షించడం జరుగుతుందని, ట్రిబ్యునల్ లో దరఖాస్తు చేసుకున్న వారికి సహాయం అందించడం జరుగుతుందని, వయోవృద్ధుల దరఖాస్తులను పోలీసు, రెవెన్యూ సిబ్బంది సానుకూల దృష్టితో చూడవలసిన అవసరం ఉందని తెలిపారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం సంబంధించిన విధివిధానాలు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. వయోవృద్ధులు tgseniorcitizens.gov.in వెబ్సైట్ ద్వారా వారి సంరక్షణకు సంబంధించిన దరఖాస్తు, ట్రిబ్యునల్ కు అప్పీలు, ఎవిక్షన్ ఆర్డర్, అప్పిలేట్ అథారిటీకి దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ వెబ్సైట్ ద్వారా సీనియర్ సిటిజన్స్ యాక్ట్ చట్టాన్ని డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. వయావృద్ధులు శారీరకంగా, మానసికంగా కలిగే ఇబ్బందులను ఫిర్యాదు చేయవచ్చని, రెవెన్యూ, పోలీస్, సంక్షేమ శాఖల సమన్వయంతో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వయోవృద్ధుల సంరక్షణ కొరకు అనేక చర్యలు తీసుకుంటుందని, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని, తద్వారా ప్రభుత్వ సేవలు వినియోగించుకోవచ్చు అని తెలిపారు. పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చే డబ్బులను ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ఖర్చు చేయాలని, ఏదైనా సలహాలు సూచనల కొరకు అధికారులు ఎప్పుడు సిద్ధంగా ఉంటారని తెలిపారు. తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జాతీయస్థాయిలో జల సంరక్షణలో భాగంగా అవార్డు పొందిన జిల్లా కలెక్టర్ ను తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు శాలువాతో సన్మానించారు. వయోవృద్ధులను సత్కరించారు. జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు జిల్లా కలెక్టర్ పై ప్రత్యేక పాట పాడి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వయోవృద్ధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# సీఎం పర్యటనకు ఏర్పాట్లు వేగవంతం గా పూర్తి చేయాలి

• జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

**కొత్త గూడెం నవంబర్ 21( సమయం న్యూస్).:** డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రానున్న సందర్భంగా ఏర్పాట్ల పురోగతిని శుక్రవారం పరిశీలించి, వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. యూనివర్సిటీ ప్రాంగణం మొత్తం ముఖ్యమంత్రి పర్యటనకు అనుగుణంగా తీర్చిదిద్దే పనుల్ని కలెక్టర్ విభాగాల వారీగా పరిశీలిస్తూ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆడిటోరియం, హాస్టల్ బ్లాక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ లు, అంతర్గత రహదారుల మరమ్మత్తు, వంటి కీలక ప్రదేశాలను సందర్శించి, పనుల పురోగతిపై ఇంజనీరింగ్ మరియు యూనివర్సిటీ అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటన సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రతీ పని వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆలస్యానికి కారణమయ్యే అంశాలు ఏవైనా ఉంటే వెంటనే నివేదించాలని, తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. యూనివర్సిటీ మొత్తం పరిశుభ్రత మరియు పచ్చదన సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ప్రతి విభాగాన్ని అందంగా మార్చేందుకు ఎంపీడీవోలను ప్రత్యేక విభాగాలకు కలెక్టర్ నియమించారు. గ్రౌండ్ లెవెలింగ్, మొక్కలు నాటడం, రోడ్ల పక్కన హార్టికల్చర్ పనులు, చెత్త తొలగింపు వంటి సుందరీకరణ కార్యక్రమాలు తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన రోజున యూనివర్సిటీ ఒక ఆదర్శవంతమైన విద్యాసంస్థగా కనిపించాలనే లక్ష్యంతో పనుల్ని అమలు చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఏలాంటి లోపాలు లేకుండా, ప్రణాళిక బద్ధంగా పని చేయాలన్న దిశగా విద్యుత్, నీటి వసతులు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, మీడియా ఏర్పాట్లు, వసతి సదుపాయాలు వంటి అన్ని విభాగాలు పరస్పరం సమన్వయంతో వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పర్యటన విజయవంతం కావాలంటే ప్రతి శాఖ సమిష్టిగా పనిచేయాలని, అన్ని ఏర్పాట్లు ప్రభుత్వ ప్రతిష్ఠకు తగ్గట్టుగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా పరిపాలన పూర్తి స్థాయి సమన్వయంతో పని చేసి, సకాలంలో అన్ని పనులు పూర్తి చేయాలని, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలి అని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జగన్మోహన్ రాజు, మున్సిపల్ కమిషనర్ సుజాత, డిపిఓ అనూష, పంచాయతీరాజ్ ఈ ఈ శ్రీనివాస్, ఎంపీడీవోలు కళాశాల ఉపాధ్యాయులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# క్షేత్ర పర్యటనలో అంగడిరైచుర్ జిల్లా పరిషద్ హై స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

**కొడంగల్ మండలం, నవంబర్,21(సమయం న్యూస్)**

క్షేత్ర పర్యటనలో భాగంగా కొడంగల్ మండలంలోని అంగడిరైచుర్ జిల్లా పరిషద్ హై స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయులు ఆంజనేయ స్వామి దేవాలయము ప్రాంగణములో వివిధ కార్యక్రమాలు నిర్వహించి శివమ్మా అచ్చప్ప స్మారక గ్రంధాలయం సందర్శించి వివిధ రకాల పుస్తకాలను విద్యార్థులకు చూపించి వస్తి ఉపయోగాలను మురళీధర్ ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు వివరించి సందేశం ఇచ్చారు మరియు ఉపాధ్యాయులు చంద్రశేఖర్ గీత భార్గవి గోవింద శ్రీనివాస్ సుమిత్ర హేమలత నర్సింలు భీంరెడ్డి మొదలగు ఉపాధ్యాయులు ఉపాధ్యాయురాలు పాల్గొని విద్యార్థులకు. చదువు వల్ల లాభాలు జీవితము ఎలా ఉన్నత స్థానము చేరుకోవచ్చు అని మనప్రాంతములో ఈలాంటి పెద్దది అనేకరకాల పుస్తకాలతో గల లైబ్రరీ నిర్వహించి విద్యార్థులకు సేవచేస్తున్నా హనుమయ్యా రిటైర్డ్ హెడ్మాస్టర్ ను ఉపాధ్యాయులు. అభినందించారువిద్యార్థులను లైబ్రరీకి. తీసుకొచ్చి విద్యార్థులకు లైబ్రరీ ఉపయోగము పడేలా చెప్పిన ప్రధానోపాధ్యాయులు సరే. మురళీధర్ ఉపాధ్యాయులు చంద్రశేఖర్ ఇతర ఉపాధ్యాయులు హానుమయ్య అభినందించారు





# అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

- కుల వృత్తులను ప్రోత్సహిస్తున్నాం
- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్ నవంబర్21( సమయం న్యూస్) :** ఎల్ ఎం డి జలాశయంలో చేప పిల్లల విడుదల అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని, ఇందు కోసం నిరంతరం కృషి చేస్తున్నామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో లోయర్ మానేరు జలాశయంలో 100% రాయితీతో ఉచిత చేప పిల్లల విడుదల కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో పాటు సుడా చైర్మన్ కోమటిరెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై జలాశయంలో చేప పిల్లలు విడుదల చేశారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రూ. 2 కోట్ల 18 లక్షల వ్యయంతో 2 కోట్ల 20 లక్షల చేప పిల్లలను చెరువులు, కుంటలు జలాశయాల్లో విడుదల చేస్తున్నామని అన్నారు. 80 నుండి 100 ఎంఎం సైజు గల ఈ చేప పిల్లలను విడుదల చేయడం ద్వారా సుమారు 2500 మంది మత్స్యకారులు ప్రత్యక్షంగా, 1300 మంది పరోక్షంగా జీవనోపాధి పొందుతారని తెలిపారు. ఎల్ఎండిలో 30 లక్షల చేపలను విడుదల చేస్తున్నామని అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం కుల వృత్తులను ఆదరిస్తూనే ఉందని తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో మత్స్యశాఖ కాంట్రాక్టర్లకు సంబంధించి పెండింగ్లో ఉన్న బకాయిలను విడుదల చేసేలా కృషి చేస్తామని అన్నారు. మత్స్యకారుల సొసైటీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా ప్రయత్నిస్తామని తెలిపారు. అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన మత్స్య కార్మికుని కుటుంబానికి రూ. 5 లక్షల బీమా చెక్కును అందజేశారు. జిల్లాలో మొట్టమొదటగా మహిళా మత్స్యకార్మిక సహకార సంఘం ఏర్పాటు చేసినందున వారికి రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందజేశారు. మత్స్య కార్మిక సంఘంలో సభ్యత్వం తీసుకున్న వారికి సభ్యత్వ నమోదు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య కార్మిక సంఘం చైర్మన్ పిట్టల రవీందర్, ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్, మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ-ంభారతి, మత్స్య కార్మిక సహకార సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం.

- ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ.




**మహబూబాద్ నవంబర్21( సమయం న్యూస్).:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుపరుస్తున్న ఉచిత చేప పిల్లల పంపిణీలో భాగంగా శుక్రవారం మహబూబాద్ జిల్లా కేంద్రంలోని కంబాల చెరువులో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి మహబూబాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి ముఖ్య అతిథిగా పాల్గొని చేప పిల్లల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 17 చెరువులో గాను ఇప్పటికే కొన్ని కబ్జాదారుల కోరల్లో ఉన్నటువంటి వాటిని విడిపించి ఎఫ్ టి ఎల్ ఏర్పాటు చేసి బఫర్ జోన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.చెరువు శిఖాలలో ఎలాంటి నిర్మాణాలను ఇతరులు చేయకూడదని సభా ముఖంగా కబ్జాదారులను హెచ్చరించారు. మా ప్రభుత్వం నాణ్యమైన చేపపిల్లను పంపిణీ చేస్తున్నదని అట్టి చేపలతో మత్యకారులు అభివృద్ధి బాటలో పయనించాలని వారు కోరారు ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షులుగా జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే ప్రారంభమైన చేప పిల్లల పంపిణీ కార్యక్రమం రెండు నియోజకవర్గాల్లో విజయవంతంగా పోయడం జరుగుతుందని నాణ్యమైన చేప పిల్లలు కొలత సరి చూసుకునే మేము ఈ చెరువులలో వదలడం జరుగుతు ఒదని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం, చీఫ్ ప్రమోటార్ శ్రీ కొత్తూరు రమేష్ మాట్లాడుతూ 350 చెరువులు, 72 సొసైటీలు, 4099 మంది సభ్యులు ఉన్నటువంటి మహబూబాబాద్ నియోజక వర్గములో నేటి నుంచి ప్రారంభమైన ఉచిత చేప పిల్లల పంపిణి కార్యక్రమం సజావుగా జరగాలని సొసైటీ అధ్యక్షులు సభ్యులు చెరువు దగ్గరకు వచ్చినటువంటి చేప పిల్లలను సరిచూసుకొని కొలత ప్రకారం లెక్క ప్రకారం తీసుకొని చెరువులలో పోసుకోవాల్సిందిగా కోరారు. ఉచిత చేప పిల్లలు పోసుకొని అభివృద్ధి బాటలో ప్రయాణించాలని ప్రభుత్వము మత్స్యకారుల కోసం ఒక ప్రత్యేకమైన కార్యక్రమం మత్స్యకారుల కొరకే ప్రవేశపెట్టింది అట్టి పథకాన్ని మత్యకారులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ దామేర శ్రీనివాస్, సంఘ అధ్యక్షులు సింగాని అశోక్, కార్యదర్శి పిల్లి దశరథ నడిగడ్డ సంఘ అధ్యక్షులు అనుమతులు గడ్డ సంఘ అధ్యక్షులు గంగపుత్ర సంఘల అధ్యక్షులు నడిగడ్డ అధ్యక్షులు కొప్పు వీరయ్య సెక్రెటరీ కోళ్ల నాగరాజు కోశాధికారి ఐలయ్య హనుమంతుని గడ్డ అధ్యక్షులు గుర్రం వెంకన్న సెక్రెటరీ ఉత్సవ బాలకృష్ణ కోశాధికారి తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు పోలీస్ అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి.

- జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి.
- సామాన్యులకు న్యాయం అందించడంలో ఆలస్యం జరగకూడదని,
- ప్రతి ఫిర్యాదుపై విచారణ వేగంగా పూర్తి కావాలి-ఎస్పీ





**వికారాబాద్, నవంబర్,21(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా పోలీస్ ఉన్నతాధికారి కె. నారాయణ రెడ్డి, ఈ రోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని సబ్-డివిజన్ల పోలీస్ అధికారులు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు మరియు ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.సమావేశం ప్రారంభంలో, ఎస్పీ జిల్లాలో ఇప్పటివరకు నమోదైన కేసుల వివరాలు, దర్యాప్తు పురోగతి, అలాగే వివిధ పోలీస్ స్టేషన్లలో పెండింగ్లో ఉన్న కేసుల స్థితి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.కేసుల పరిష్కారంలో జాప్యం జరగకుండా చూడాలని, త్వరితగతిన పూర్తి చేయాల్సిన కేసులను వెంటనే ముగించాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా, సామాన్యులకు న్యాయం అందించడంలో ఆలస్యం జరగకూడదని, ప్రతి ఫిర్యాదుపై చట్టపరమైన విచారణ వేగంగా పూర్తి కావాలని ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల నేపథ్యంలో తమ తమ పోలీస్ స్టేషన్ల పరిధిలలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకు ండా ముందుగానే పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు.అంతేకాక, రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ముఖ్యంగా హైవేలపై మరియు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలలో ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ఎస్పీ గారు తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల విషయంలో సున్నితంగా వ్యవహరించి, దర్యాప్తును వేగవంతం చేయాలని, వారికి తక్షణ న్యాయం అందేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.అధికారులు అందరూ ప్రజలకు పోలీస్ సేవలు అందుబాటులో ఉండేలా, పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో మరింత నమ్మకం పెరిగేలా పనిచేయాలని ఆయన కోరారు. ముఖ్యంగా, ప్రతి కేసు దర్యాప్తులో శిక్షా శాతం (కన్విక్షన్ రేటు) పెరిగే విధంగా పకడ్బందీగా ఇన్వెస్టిగేషన్ చేయాలని, ఆన్లైన్ మోసాలు (సైబర్ నేరాలు) నేరాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ కె. నారాయణ రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు.

# వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్-లింగ్యా నాయక్

### తెలంగాణ ప్రభుత్వము జిల్లా పౌర సరఫరాల కార్యాలయము వికారాబాద్

**దోమ మండలం, నవంబర్,21(సమయం న్యూస్) :** ఆదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ పౌర సరఫరాల శాఖ వికారాబాద్ జిల్లా దోమ మండలంలో ( రాకొండ మరియు దోమ) Paddy Procurement Centres ను తనిఖీ చేశారు. Tab entrys త్వరగా పూర్తి చేసి, రైతుల బ్యాంకు ఖాతా లో msp డబ్బులు ఎప్పటికప్పుడు త్వరగా చేరేలాగా మరియు రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా Paddy Procurement సజావుగా చేయవలసినదిగా సూచనలు ఇవ్వడం జరగింది.ఇందు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సుదర్శన్, దోమ తహసిల్దార్ అధికారులు పాల్గొన్నారు.





## ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన వికారాబాద్ జిల్లా నూడల్ అధికారి శంకర్ నాయక్



**దౌల్తాబాద్ మండలం, నవంబర్,21(సమయం న్యూస్) :** దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం వికారాబాద్ జిల్లా నోడల్ అధికారి శంకర్ నాయక్ సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. అర్ధవార్షిక పరీక్షల మార్కులు, ఎగ్జామ్ కి సంబంధించిన ఫీజ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫైనల్ పరీక్షలకు ఇంకా కొద్దిరోజుల సమయమే ఉందని, అందరూ పట్టుదలగా చదివి, మంచిమార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం ఏర్పాటుచేసి, 90 రోజుల ప్రణాళికను రెడీ చెయ్యాలని, ఈ నెల చివరివరకు సిలబస్ పూర్తి చెయ్యాలని అధ్యాపకులకు సూచించారు. సబ్జెక్టులవారీగా ఉదయం 9 నుండి 9:30 వరకు, సాయంత్రం 4 నుండి 5 వరకు స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. అన్ని సబ్జెక్టులలో పిల్లలందరూ మంచి మార్కులు సాధించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ టి. వసంత మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నతమైన ఫలితాలు సాధించేలా, అధ్యాపకులు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని, ఫెయిల్ అయ్యే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే కళాశాలలో ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామన్నారు. అధ్యాపకులందరూ ఇప్పటికే 90రోజుల ప్రణాళిక తయారుచేసి ఇచ్చారని పేర్కొన్నారు. దాని ప్రకారమే తరగతులు నిర్వహిస్తున్నామన్నారుఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రధాన రోడ్లలో ఫుట్ పాత్ ఏర్పాటుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, నవంబర్ 21:( సమయం న్యూస్ ):** నగరంలోని ప్రధాన రోడ్లలో ఫుట్ పాత్ ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.కలెక్టరేట్ లోని, తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి ఖమ్మం నగరంలో ప్రధాన రోడ్లలో ఫుట్ పాత్ ల ఏర్పాటు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యల గురించి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం నగరంలో వైరా రోడ్డు, బైపాస్, ఇల్లందు రోడ్డు వంటి 8 ప్రధాన రోడ్లకు సంబంధించి ఫుట్ పాత్ ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఫుట్ పాత్ పై ఏర్పాటు చేయాల్సిన ప్లాంటేషన్, స్ట్రీట్ లైటింగ్, టైల్స్, సైకిల్ ట్రాక్ ఏర్పాటు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. నగరంలో అవసరమైన చోట ఫుట్ పాత్ వద్ద బస్ బే సైతం ఉండేలా ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. దేశంలోని ఇతర నగరాలలో ఉన్న డిజైన్లను పరిశీలించి, ఖమ్మం నగర అవసరాలను దృష్టిలో పెట్టుకుని మంచి డిజైన్ తయారు చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సెంట్రల్ డివైడర్ తో పాటు ఫుట్ పాత్ వే అధికంగా ఉండేలా చూడాలని అన్నారు. దాంతో పాటు పోల్స్, లైటింగ్ ప్రత్యేకంగా ఉండాలని అన్నారు. నగరంలో రాంగ్ సైడ్ డ్రైవింగ్ అరికట్టడానికి ఏఐ సాంకేతికత సహాయంతో దీనిని గుర్తించేలా ఏర్పాట్లు చేసి, రోడ్ల ప్రమాదాల నియంత్రణకు నగరంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.ఖమ్మం నగరంలో పలు చోట్ల గుంతలను పూడ్చి రోడ్లను మరమ్మత్తు చేశామని, ప్రస్తుతం లేన్ మార్కింగ్ పనులు కూడా జరుగుతున్నాయని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు వాహనదారులు పాటించేలా పకడ్బందీ పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో మునిసిపల్ డిఇ ధరణి కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుడి పాడే మోసిన ఆగ్రో చైర్మన్



**బాన్సువాడ నవంబర్ 21(సమయం న్యూస్ ) :** బాన్సువాడ మండలం ఇబ్రాహీంపేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ ఉద్దెర చిన్న హన్మండ్లు అప్పా ఆకస్మిక మరణం స్థానికంగా విషాదాన్ని నెలకొల్పింది. గ్రామాభివృద్ధికి కృషి చేసిన ఆయన మరణం గ్రామానికి పెద్ద లోటుగా భావిస్తున్నారు.

ప్రజల సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండే హనుమాన్లు అందరికీ అందుబాటులో ఉండే నాయకుడిగా పేరుపొంది ఉన్నారు. ఆకస్మికంగా కన్నుమూయడంతో గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.మరణ వార్త తెలిసిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, టీఎస్ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు ఇబ్రాహీంపేట్ వెళ్లి పార్థివదేహానికి నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు హన్మండ్లు పార్టివ దేహ పాడే మోసి కార్యకర్త పట్ల తన అభిమానాన్ని చాటుకున్నారు. హన్మండ్లు కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు.అంత్యక్రియలకు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీ... తెలంగాణలోని ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు అందజేస్తాం

• ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి





**పరిగి మున్సిపల్(మం) నవంబర్ 21(సమయం న్యూస్) :** ఎమ్మెల్యే టిఆర్ఆర్ ప్రతి మహిళకు నాణ్యమైన చీరలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్లలోని చేనేత కార్మికులతో ప్రత్యేకంగా ఇందిరమ్మ చీరల తయారు చేయించారని వికారాబాద్ జిల్లా పరిగి ఎమ్మెల్యే డా.టి రామ్మోహన్ రెడ్డి అన్నారు. పరిగి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో శుక్రవారం ఎమ్మెల్యే టిఆర్ఆర్ ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాలతో పాటు ప్రతి ఇంటి మహిళలకు ఈ చీరలు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇందిరాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని తెలంగాణలో ప్రతి ఇంటికి, ప్రతి ఒక్కరికి 2 చీరలు ఇవ్వడం జరుగుతుంది అని తెలిపారు. ఇందిరా గాంధీ మొదటి మహిళ ప్రధాని గా భూ స్వాముల వద్ద భూములు తీసుకొని పేద వాళ్లకు పంపిణీ చేసి, బ్యాంకులను జాతీయం చేసిన ఘనత తోపాటు రోటీ కప్డ మకాన్ అనే నినాదంతో వారు సంస్కరణలు చేశారని తెలిపారు. మహిళల పేరు మీద ఇందిరమ్మ ఇళ్లు ప్రతి గ్రామంలో నిర్మించుకోవడం జరుగుతుందని, సుమారు 3500 ఇండ్లు నియోజకవర్గంలో కట్టడం జరుగుతుందని అన్నారు.సోనియా గాంధీ నగర్, రాజీవ్ గాంధీ నగర్ గా పూడూరు మండలంలో కట్టియడం జరుగుతుందని తెలిపారు.మహిళా సంఘాల కు 41 వేల చీరలు పరిగి నియోజకవర్గానికి ఈ విడతలో అందిస్తున్నామని, పరిగి నియోజకవరగంలో 1075 కోట్లు రూపాయలు మహిళ సంఘాలకు రుణాలు ఇవ్వడం జరిగిందని, వడ్డీ లేని రుణాలు ఇవ్వడం తోపాటు పరిగి నియోజకవరగంలో 9 కోట్ల 63 లక్షలు రూపాయలు వడ్డీ తిరిగి సంఘాలకు పంచడం జరిగిందని తెలిపారు.మహిళా సంఘాల సభ్యులు ఎవరన్నా చనిపోతే 10 లక్షల రూపాయల బీమా చేయించడం జరిగిందని, ఇప్పటికే చనిపోయిన 11 మందికి పరిగి నియోజకవర్గంలో 10 లక్షల బీమా పథకం ద్వారా కోటి పది లక్షల రూపాయలు మంజూరు అయిందని అన్నారు. మహిళా సమాఖ్య ద్వారా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం, ఆర్టీసి లో మహిళా సంఘాలు బస్సు అద్దెకు తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు.

## సీనియర్ జర్నలిస్ట్ గిరి ప్రసాద్ కు నియోజకవర్గ జర్నలిస్టుల ఘన నివాళి



**పటాన్ చెరు, నవంబర్ 21 (సమయం న్యూస్):** పటాన్‌చెరు సీనియర్ జర్నలిస్ట్ గిరి ప్రసాద్ ఇటీవల గుండెపోటుతో అకాల మరణం చెందడంతో స్థానిక జర్నలిస్టు వర్గంలో తీవ్ర విషాదం నెలకొంది. ఇందులో భాగంగా పటాన్‌చెరు నియోజకవర్గ జర్నలిస్టుల ఆధ్వర్యంలో రామచంద్రాపురంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో సంస్మరణ సభను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డి.ఎస్.పి ప్రభాకర్, పటాన్‌చెరు సిఐ వినాయక రెడ్డి, బిఆర్ఎస్ యువ నాయకుడు ప్రిథ్వీరాజ్ హాజరయ్యారు. అనంతరం గిరి ప్రసాద్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ప్రిథ్వీరాజ్ మాట్లాడుతూ, గిరి ప్రసాద్ నిజాలను వెలుగులోకి తేవడంలో చూపిన ధైర్యం, నిబద్ధత జర్నలిజం విలువలకు నిదర్శనమని పేర్కొన్నారు. పటాన్‌చెరులో సామాజిక సమస్యలు, ప్రజల కష్టాలు, ప్రభుత్వ పథకాల అమలు వంటి ఎన్నో అంశాలను ఆయన నిరంతరం ఆవిష్కరించి పరిష్కార దిశగా నడిపినట్లు అభిప్రాయపడారు.గిరి ప్రసాద్ మృతి పటాన్‌చెరు జర్నలిస్ట్ వర్గానికి తీరని లోటు అని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జర్నలిస్టులు, నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల తరలింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

• విద్యార్థి ప్రజాసంఘాల నాయకులు





**కొడంగల్ మున్సిపల్(మం)నవంబర్,21(సమయం న్యూస్) :** మెడికల్ కాలేజీ,యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల భవనాల నిర్మాణాలను శంకుస్థాపన చేసినచోట నుండి హకీంపేట్, పోలేపల్లికి తరలించడం సరికాదని,యథాస్థానంలో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజాసంఘాల నాయకులు అన్నారు.కెడిపి జెఏసి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థి,ప్రజాసంఘాల నాయకుల చేత వాల్ పోస్టర్ కరపత్రాలు విడుదల చేశారు. ఈసందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భీములు,కేడిపి జేఏసీ కో కన్వీనర్స్ గంటి సురేష్ కుమార్,ఎరన్ పల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రంలో విద్యా,వైద్య, భవనాలతో పాటు ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని, శంకుస్థాపన చేసి పనులు కొనసాగించి, మధ్యలో ఆపేసి మారుమూల ప్రాంతాలకు తరలించడం సరికాదన్నారు.అన్ని రకాల రవాణా, వ్యాపార,సదుపాయాలు కలిగిన నియోజక వర్గ కేంద్రంలో మెడికల్ కాలేజీ,గురుకుల భవనాలు,సైనిక్ పాఠశాలలు వంటివి నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరాలోచించి హకింపేట్, పోలేపల్లికి తరలించిన మెడికల్ కాలేజీ, గురుకుల భవన నిర్మాణాలను కొడంగల్ పట్టణ కేంద్రంలో నిర్మించేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏబీవీపీ పట్టణ అధ్యక్షులు నిఖిల్,బస్వరాజ్, వెంకటేష్,విద్యార్థి సంఘాల నాయకులతో పాటు ఆయా గ్రామాల యువకులు పాల్గొన్నారు.

## సీతారామపురం కాలనీలో భూ ఆక్రమణలపై ఉక్కుపాదం

- పూర్తి స్థాయి సర్వే ద్వారా ఆక్రమణల గుర్తింపు
- పార్కులు, ప్రార్థన స్థలాలు, అంతర్గత రహదారుల కబ్జాలపై ఎమ్మెల్యే జిఎంఆర్ తీవ్ర ఆగ్రహం..
- జిహెచ్ఎంసి, నీటి పారుదల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్ష.
- త్వరితగతిన ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు



**పటాన్ చెరు, నవంబర్ 21,(సమయం న్యూస్):** పటాన్ చెరు డివిజన్ పరిధిలోని సీతారామపురం కాలనీలో చోటు చేసుకుంటున్న భూమి ఆక్రమణలపై పూర్తిస్థాయి సర్వే నిర్వహించి, కబ్జాదారులపై ఉక్కుపాదం మోపుతామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిహెచ్ఎంసి, రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాల క్రితం పటాన్ చెరు డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీతారామపురం కాలనీలో గత కొన్ని సం వత్సరాలుగా అంతర్గత రహదారులు, పార్కులు, ప్రార్థన స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయని స్థానికులు ఫిర్యాదులు చేయడం జరిగిందని తెలిపారు. కాలనీని ఏర్పాటు చేసిన డెవలపర్లు ప్రభుత్వానికి రిజిస్టర్ చేయవలసిన రహదారులు, ప్రార్థన స్థలాలు, పార్కుల స్థలాలను సైతం బై నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. చివరకు కాలనీ సరిహద్దులలో గల చెరువులు, కాలువలను సైతం ఆక్రమించి ప్లాట్లు అభివృద్ధి చేస్తున్నారని ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 1998వ సంవత్సరంలో మొదటి లేఔట్ తో ప్రారంభించి నేటి వరకు మూడు లేవుట్లుగా తయారు చేయడం జరిగిందని తెలిపారు.రాబోయే రోజుల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తి అవకాశాలు ఉన్నందున పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి ఆక్రమణలపై ఉక్కు పాదం మోపాలని అధికారులను ఆదేశించారు. కబ్జాలకు కారకులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మార్వో రంగారావు, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, నీటి పారుదల శాఖ డిఈ రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్

**బొంరస్ పేట మండలం, నవంబర్,21(సమయం న్యూస్)**

బొంరస్ పేట మండల కేంద్రంలో శుక్రవారం చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చౌదర్పల్లి జి హెచ్ ఎం రవీందర్ గౌడ్ ప్రారంభం చేశారు. ఈ పోటీ పరీక్షలో జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల బోంరాస్ పేట్ నుండి E/M.03.T/M.03, ZPHS. చౌదర పల్లి నుండి E/M.03,T/M.0 3.ZPHS- రేగడి మైల్వారు T/M.ముగ్గురు,AHS.గిరిజన ఆశ్రమ పాఠశాల నుండి E/M.03 మొత్తం.18 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయి లో మెరిట్ సాధించిన పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో ఎంపిక చేయ బడతారు.ఈ పోటీ పరీక్షలో గ్రూప్ చర్చ ద్వారా జవాబులు వ్రాయ వలసి ఉంటుంది. మండల స్థాయి టాలెంట్ టెస్ట్ లో పాల్గొన్న ఉపాధ్యాయులు కే. ప్రశాంత్ కుమార్ ఇన్చార్జ్ ప్రధాన ఉపాద్యాయులు, రేగడి మైల్వారు శ్యామల య్య,ఆశ్రమ పాఠశాల నుండి నవనీత పి.డి. మండల కోఆర్డినేటర్ బాకారం మల్లయ్య ,చంద్రశేఖర్ పాల్గొన్నా రు.అనంతరం మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ యందు ఇంగ్లీష్ మీడియం యందు PM SREE. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బొంరస్ పేట జిల్లా స్థాయికి ఎంపిక





కావడం జరిగింది.అలాగే తెలుగు మీడియం నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రేగడి మైల్వారు ఎంపిక కావడం జరిగింది.మండల పరిధిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని సరోజ 10వ తరగతి, విద్యార్థులు అఖిల్ 9 తరగతి, డి రమణ 8వ తరగతి వారికి సర్టిఫికెట్లను అందజేసి అభినందనలు తెలిపిన జిహెచ్ఎం రవీందర్ గౌడ్

## పటాన్ చెరులో ఉప ఎన్నిక వస్తే బిఆర్ఎస్ జండా ఎగరడం ఖాయం

• నియోజకవర్గ ఇన్చార్జ్ ఆదర్శ్ రెడ్డి



**పటాన్ చెరు, నవంబర్ 21(సమయం న్యూస్):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో ఉప ఎన్నిక వస్తే బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని నియోజక వర్గ ఇన్చార్జ్ ఆదర్శ్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో, పటాన్‌చెరు డివిజన్ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ నివాసంలో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నిర్వహించిన ఈ సమావేశంలో గుమ్మడిదల, పటాన్‌చెరు మండల పరిధిలోని గ్రామపంచాయతీల విషయాలపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా గుమ్మ డిదల మండలానికి ఇన్‌చార్జ్‌లుగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, గుమ్మ డిదల బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డిని, పరిశీలకులుగా జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి, జిన్నారం సీనియర్ నాయకుడు వెంకటేష్ గౌడ్‌లను నియమించారు. అలాగే పటాన్‌చెరు మండలానికి కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్ లను ఇన్‌చార్జ్‌లుగా నిర్ణయించారు. తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమీ రెడ్డి, రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తోంట అంజయ్య, తెల్లాపూర్ మాజీ వైస్ మునిసిపల్ చైర్మన్ రాములు గౌడ్‌లను పరిశీలకులుగా నియమించారు.నాయకులు మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గంలో ఉపఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ గెలుపు సాధించేందుకు క్యాడర్ పూర్తిగా సిద్ధంగా ఉందని, ఉపఎన్నికలను ధైర్యంగా ఎదుర్కొనే శక్తి పార్టీకి ఉందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పట్టణం నుండి గ్రామాల దాకా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ శక్తివంతమైన పోరాటం చేపడుతుందని, పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి పార్టీ అండగా నిలుస్తుందని చెప్పారు.రాబోయే పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు భారీ మెజారిటీ వచ్చేలా కట్టుదిట్టమైన కార్యాచరణ చేపట్టనున్నట్లు నాయకులు స్పష్టం చేశారు. సమావేశంలో ఆదర్శ్ రెడ్డి, మెట్టు కుమార్ యాదవ్, తోంట అంజయ్య, కొలన్ బాల్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెండు టిప్పర్ల నడుమ ఇరుక్కుని వ్యక్తి మృతి

**దౌల్తాబాద్ మండలం, నవంబర్,21(సమయం న్యూస్) :** దౌల్తాబాద్ మండల ఎస్సై బి రాజ్ కుమార్ తెలిపిన ప్రకారం రామాపురం గ్రామం, కలసపాడు మండలం కడప జిల్లా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నాలి శ్రీను ఏ శ్రీనివాసులు తండ్రి నాలి చిన్న పాపయ్య, వయసు 28 సంవత్సరములు, కులం యాదవ్, వృత్తి: టిప్పర్ డ్రైవర్, బ్రతుకు దెరువు కొరకు వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి సుమారు నెల క్రితం రావడం జరిగింది. నిన్న అనగా 20 నవంబర్ 2025 నాడు ఉదయం అందాజా 10:45 గంటల సమయంలో బలంపేట్ నుండి అంతారం రోడ్డు కొరకు అల్లాపూర్ గ్రామ శివారులో గల బర్రె రాజు





పొలము నుండి మొరమును టిప్పర్లలో తరలించే సమయంలో మొరమును లోడ్ చేస్తున్న సమయంలో టిప్పర్ డ్రైవరు హ్యాండ్ బ్రేక్ వెయ్యకుండా క్రిందికి దిగడంతో ఆ టిప్పర్ ఎత్తులో నుండి క్రిందికి వస్తున్నట్టు గమనించిన శ్రీనివాసులు తాను ఆపుకున్న టిప్పర్ నుండి క్రిందికి దిగడానికి ప్రయత్నించగా ఆ టిప్పర్ వచ్చి తాను ఉన్నటువంటి టిప్పర్ను ఢీ కొట్టడంతో రెండు టిప్పర్ల మధ్యలో ఇరుక్కొని మ-రణించాడని తండ్రి నాలి చిన్న పాపయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించడం జరిగిందని దౌల్తాబాద్ ఎస్సై బి రాజ్ కుమార్ తెలిపారు.

# సంక్రాంతి నాటికి సబ్ స్టేషన్ పనులు పూర్తి చేయాలి

## ● మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



**ఖమ్మం , నవంబర్ 21 : ( సమయం న్యూస్ ) :** సంక్రాంతి నాటికి సబ్ స్టేషన్ పనులు యుద్ధ ప్రాతిపదిక పై పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.

మంత్రి శుక్రవారం రఘునాథపాలెం మండల వి. వెంకటాయపాలెంలో మంచుకొండ ఎత్తిపోతల పథకం కు అనుసంధానంగా చేపట్టిన 33/11 కెవి సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ మంచుకొండ ఎత్తి పోతల పథకంలో ఉన్న పెద్ద మోటర్లకు సరిపడా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా 33/11 కేవి సబ్ స్టేషన్ మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఎం డాకాలం వచ్చేలోపు చెరువులో నీళ్ళు ఉండేలా చూడాలని, సంక్రాంతి నాటికి సబ్ స్టేషన్ నిర్మాణ పనులు పూ-ర్తయ్యేలా యుద్ధ ప్రాతిపదికన పనులు జరగాలని అన్నారు. పైపులైన్ ద్వారా బుగ్గ వాగు నుంచి కామేపల్లి, రఘునాథపాలెం మండలంలోని కొన్ని చెరువులకు నీరు నింపేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. రైతులు లాభసాటి పంట ఆయిల్ పామ్ సాగు చేయాలని, అంతర్ పంటల వల్ల ఆదాయం లభిస్తుందని అన్నారు. 3 సంవత్సరాల సమయంలో పంట చేతికి వస్తుందని అన్నారు. ఖమ్మం జిల్లాలో గోద్రెజ్ వారి పామాయిల్ ఫ్యాక్టరీ సైతం సంక్రాంతి నాటికి అందుబాటులోకి వస్తుందని అన్నారు. ఇందిరమ్మ చీరలను గ్రామీణ ప్రాంతాలలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు పంపిణీ చేయాలని అన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి బొట్టు పెట్టి, ఇందిరమ్మ చీర అందించాలని అన్నారు. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ లోపు చీరల పంపిణీ పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. గ్రామాలలో మంజూరైన అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పర్యవేక్షించాలని, పనులు నాణ్యతతో జరగాలని అన్నారు. మన ఊరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రైతాంగానికి ఉపయోగపడే విధంగా రోడ్ల విస్తరణ చేయాలని అన్నారు. ప్రజలందరూ చర్చించుకుని ఏకగ్రీవంగా గ్రామ పంచాయతీలలో సర్పంచ్ లను ఎన్నుకుంటే పది లక్షల రూపాయల గ్రాంట్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూలి సుదీర్ఘ కాలం ప్రజల ఆశను నెరవేరుస్తూ 24 చెరువులు నింపడం ద్వారా 2200 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంగా చేపట్టిన మంచుకొండ ఎత్తిపోతల పథకంకు అనుసంధానంగా చేపట్టిన 33/ 11 కేవి సబ్ స్టేషన్ నిర్మాణ పనులు నేడు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. వివి పాలెం గ్రామంలో ప్రజలకు రావాల్సిన ఇండ్ల పట్టాలపై తహసిల్దార్ ప్రత్యేకంగా పరిశీలించి అర్హులకు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, ట్రాన్స్కో ఎస్ఇ మహేందర్, ఇర్రిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, పీఆర్ ఇఇ మహేష్ బాబు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజమే మన అందరి లక్ష్యం

## ● జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ (ఐపీఎస్)



**నారాయణపేట, నవంబర్,21(సమయం న్యూస్) :** డ్రగ్స్ గంజాయి రహిత సమాజం నిర్మించడం మన అందరి సామూహిక బాధ్యత” అని ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు .నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘నషా ముక్తా భారత్ అభియాన్’ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భం గా ముందుగా భరతమాత చిత్ర పటానికి పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు, యువతకు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల దుష్ప్రభావాలు మరియు వాటి నియంత్రణపై సమగ్ర అవగాహన కల్పిస్తూ ప్రొజెక్టర్ ద్వారా షార్ట్ ఫిలిం వీడియోస్ ప్లే చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... నార్కోటి డ్రగ్ అనేది ఒక టెర్రరిస్ట్ లాంటిది అని దేశం మొత్తం నాశనం చేస్తుందని తెలిపారు. ప్రపంచ దేశాల్లో యువత ఎక్కువగా ఉన్న దేశం, భారతదేశం అని ప్రస్తుత కాలంలో ఒక దేశాన్ని నాశనం చేయాలంటే న్యూక్లియర్ బాంబులు వేయనక్కర్లేదని, దేశ యువతని నాశనం చేస్తే ఆదేశాన్ని అంధకారంలోకి నెట్టొచ్చని, అందుకు డ్రగ్స్ అనే మహమ్మారిని ఇతర దేశాల నుండి మన దేశంలోకి పంపించి యువతను డ్రగ్స్ మహమ్మారికి అలవాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఉదాహరణకు భారత దేశం మొత్తంలో ఆర్మీకి ఎక్కువ ఎన్నిక అయ్యేవారు పంజాబ్, హర్యానా రాష్ట్రాలు ఉండేవి అలాంటి రాష్ట్రాలలో యువతకు డ్రగ్స్ అలవాటు చేసి రాష్ట్ర మొత్తం యువత నిర్వీర్యం అవడం జరుగుతుందని కావున అలాంటి దురాలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండి దేశ భవిష్యత్తుకు పునాదులు వేయాలని ఎస్పీ అన్నారు. యు-వతను ఈ చెడు అలవాట్ల నుండి దూరంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సమాజంలో అవగాహన పెంచాలని, యాంటి నార్కోటిక్ డ్రగ్ వారియర్ గా పనిచేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌ను ఒక్కసారి తాకితే%౫% జీవితం మొత్తం అంధకారంలోకి వెళ్లే ప్రమాదం ఉంది అని మత్తు పదార్థాల వ్యసనం కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నాయి అని డ్రగ్స్ వల్ల యువత భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతోంది. ఈ సమస్యను నిర్మూలించేందుకు ప్రతి పౌరుడు, ప్రతి తల్లిదండ్రులు, ప్రతి ఉపాధ్యాయుడు, ప్రతి యువకుడు ముందుకు రావాలి అన్నారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయం లేదా వినియోగం చేస్తూ కనిపించినట్లయితే 1908 టోల్ ఫ్రీ నంబర్ లేదా డయల్ 100 కు వెంటనే సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వ్యక్తిగత వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి అని హామీ ఇచ్చారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజల సహకారం అత్యంత ముఖ్యమని, ప్రతి ఒక్కరూ సమాజాన్ని కాపాడే యోధులు కావాలని ఎస్పీ చెప్పారు .కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజశేఖర్ , సీఐ శివశంకర్,ఎస్సై లు వెంకటేశ్వర్లు, సునీత,బజరంగ్ దళ్ అధ్యక్షుడు వడ్ల శ్రవణ్, కార్యదర్శి కన్న శివకుమార్, నగర అధ్యక్షుడు మురళి బట్టడ్, ఏబీవీపీ కన్వీనర్ నరేష్, వెంకటరమణ వెంకటేష్ ఆకాష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# “ఆపరేషన్ చపుత్ర” 56 మంది యువకుల్ని పట్టుకుని కౌన్సిలింగ్

## ● జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట, నవంబర్,21(సమయం న్యూస్) :** జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ పరిధిలో గురువారం రాత్రి, లోకల్ పోలీసులు, ప్రత్యేక దళాలు ఆపరేషన్ చపుత్ర కార్యక్రమాన్ని నిర్వహించి కాలనీలో, హొటల్, షాపుల ముందల, పబ్లిక్ ప్లేసుల వద్ద అనుమానాస్పదంగా గుమికూడి యువతీ-మహిళలకు అసౌకర్యం కలిగించేలా తిరుగుతున్న వారు నారాయణపేట నుండి 26, మక్తల్-18,మరికల్ -07, కోస్గి - 5 మంది మొత్తం 56 మంది యువకులను పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. అనంతరం వారందరికి మహిళల పట్ల గౌరవం, ఈవ్ టీజింగ్ - హరాస్మెంట్‌పై చట్టపరమైన శిక్షలు, బాధ్యతాయుత ప్రవర్తన, యువత భవిష్యత్తుపై ప్రభావం వంటి అంశాలపై యువతకు వారి తల్లిదండ్రులను పిలిపించి వారి సమక్షంలో చైతన్యం కల్పిస్తూ, ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... నేటి యువకులే రాబోయే భావితరాలకు బాటసారులని అలాంటి యువత నేడు అర్ధరాత్రి వరకు కాలనీలలో విచ్చలవిడిగా తిరుగుతూ దారిన పోయే వారిపై అనుచిత వాక్యాలు చేస్తూ తమ విలువైన బంగారు సమయాన్ని వృధా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత తమకున్న సమయాన్ని వృధా చేసుకుంటే భవిష్యత్తు అంధకారమవుతుందని కావున తమకున్న ప్రతి ఒక్క నిమిషాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నతంగా ఎదిగి సమాజంలో మార్పు తీసుకురావాలని కోరారు. జిల్లా పరిధిలో మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృత్తమైతే అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు .అలాగే జిల్లా పరిధిలో మహిళల భద్రత మా ప్రథమ బాధ్యత ఎవరి నుంచైనా వేధింపులు జరిగితే అట్టి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలు యువకులు చట్టాన్ని గౌరవించి, బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై గమనిస్తూ ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఆపరేషన్ చపుత్ర లో పట్టుబడ్డ 56 మంది యువతకు ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు నిర్వహించి కౌన్సిలింగ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతమైతే కేసులు నమోదు చేస్తామని అన్నారు.

# రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రిజర్వేషన్ పక్రియ నిర్ణయించండి.

## జిల్లా కలెక్టర్ హైమావతి.

**సిద్ధి పేట నవంబర్21( సమయం న్యూస్). :** గ్రామపంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ ప్రక్రియపై శుక్రవారం జిల్లా కలెక్టర్ కే హేమావతి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పంచాయతీ శాఖ అధికారులు మరియు సిబ్బందితో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధన మేరకు జిల్లాలో గల 508 గ్రామపంచాయతీలు, 4508 వార్డులలో రిజర్వేషన్ ప్రక్రియను చేపట్టాలని సూచించారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల కొరకు 2011 సెన్సెస్ మరియు బీసీ రిజర్వేషన్ల కొరకు 2024 ప్రకారం మొత్తం 50% ఉంచకుండా రిజర్వేషన్ ప్రక్రియ ఆయా డివిజన్ల ఆర్డీవోల నేతృత్వంలో చేపట్టాలని అన్నారు. గ్రామ వార్డు సభ్యుల రిజర్వేషన్ % ప్రకారం చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈఓ రమేష్, డిపిఓ విజయ్ కుమార్, సిద్ధిపేట గజ్వేల్ ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీలు పాల్గొన్నారు.

# విపత్తు ప్రణాళిక హ్యాండ్‌బుక్ రూపకల్పనకు ఇండియా హౌస్ బృందం విస్తృత పర్యటన

## ● జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మార్గదర్శకంలో



**కొత్తగూడెం నవంబర్21( సమయం న్యూస్). :** జిల్లా విపత్తు కార్యాచరణ ప్రణాళిక హ్యాండ్‌బుక్‌ను శాస్త్రీయ ఆధారాలతో, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా రూపొందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించిన దిశలో, ఇండియా హౌస్ ప్రతినిధి బృందం శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విస్తృత స్థాయి క్షేత్ర పర్యటన నిర్వహించింది. జాహ్నవి, సోనల్ ఘోడ్గే, మురళి (డిప్యూటీ కలెక్టర్) లతో కూడిన ఈ బృందం సహజ వనరులు, పర్యావరణ వ్యవస్థ, అడవి సంరక్షణ, పరిశ్రమల ప్రభావం, వాతావరణ మార్పుల నేపథ్యం వంటి అంశాలను పరిశీలిస్తూ పలు ప్రాంతాలలో ప్రత్యక్ష సమాచారం సేకరించింది. పర్యటనలో భాగంగా ముందుగా సింగరేణి ఆధ్వర్యంలో నడుస్తున్న నర్సరీలను సందర్శించిన బృందం, గనుల తవ్వకాల వల్ల కోల్పోయిన అడవులను పునరుద్ధరించేందుకు చేపడుతున్న పునర్వనీకరణ చర్యలు, శాస్త్రీయ పద్ధతుల్లో పెంచుతున్న వివిధ జాతుల మొక్కలు, పునరావాసం చేసిన గనుల ప్రాంతాల్లో అమలు చేస్తున్న జీవవైవిధ్యం సంరక్షణ కార్యక్రమాలపై అధికారులు ఇచ్చిన వివరాలను సమగ్రంగా పరిశీలించింది. పర్యావరణ పరిరక్షణ చర్యలలో సింగరేణి సంస్థ చేపడుతున్న నాణ్యతా ప్రమాణాలను కూడా బృందం అధ్యయనం చేసింది. తదుపరి కిన్నెరసాని అభయారణ్యం మరియు కిన్నెరసాని డ్యామ్‌ను సందర్శించిన బృందం, అభయారణ్యంలో అరుదైన వృక్షజాతులు, జంతువులు, అడవి సంరక్షణ పథకాలు, అడవుల నరికివేత వల్ల వాతావరణ మార్పులపై పడుతున్న ప్రభావం వంటి అంశాలను అటవీ అధికారులు వివరించారు. కిన్నెరసాని డ్యామ్ వద్ద నీటి నిల్వలు, వరద నియంత్రణ వ్యవస్థ, జలవనరుల నిర్వహణ విధానాలు మరియు డ్యామ్ భద్రతా ప్రమాణాలను బృందం సమీక్షించింది. అటవీ శాఖ అధికారి కృష్ణగౌడ్‌తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలో అడవుల ప్రస్తుత స్థితి, అక్రమ వృక్ష నరికివేత నియంత్రణ చర్యలు, వాతావరణ మార్పులతో సంభవించే సహజ విపత్తుల ప్రభావం, వరదలు మరియు నేల ధూపాన్ని నిరోధించేందుకు చేపట్టాల్సిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. మాదారం గ్రామంలోని నాయకపోడు మాస్క్ తయారీ కేంద్రాన్ని పరిశీలించిన సందర్భంగా, మాస్క్ తయారీలో వినియోగించే చెక్క మూలాలు, వాటి వల్ల అడవులపై పడే ప్రభావం, పర్యావరణ హిత ప్రత్యామ్నాయాల అమలు వంటి అంశాలను బృందం సమీక్షించింది. అనంతరం దమ్మపేటలోని ఆయిల్ పామ్ పరిశ్రమను సందర్శించి, ఉత్పత్తి విధానాలు, పరిశ్రమ వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణ చర్యలపై అధికారులు అందించిన వివరాలను అధ్యయనం చేశారు. రోజంతా సాగిన ఈ విస్తృత క్షేత్ర అధ్యయనంలో బృందం జిల్లాలోని సహజ వనరులు, అటవి వ్యవస్థ, పరిశ్రమల పర్యావరణ ప్రభావం, గ్రామీణ జీవన విధానాలు వంటి పలు కీలక రంగాలపై వివరాలను సేకరించింది. ఈ సమాచారం మొత్తం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మార్గదర్శకంలో రూపుదిద్దుకుంటున్న జిల్లా విపత్తు కార్యాచరణ ప్రణాళిక హ్యాండ్‌బుక్ తయారీలో ప్రధాన ఆధారాలుగా ఉపయోగించబడనున్నాయని అధికారులు తెలిపారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ నవంబర్21( సమయం న్యూస్).:**యువత, విద్యార్థులు సహా ప్రతీ ఒక్కరి భవిష్యత్తు బంగారు భవిష్యత్తు కావాలంటే మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలనీ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో శుక్రవారం డ్రగ్స్ నిర్మూలన అధికారులు పోలీసు సిబ్బందితో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావులు సమావేశం నిర్వహించారు.

సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ప్రస్తుతం డ్రగ్స్, మత్తు పదార్థాల వాడకం పెరిగిపోతూ, మహమ్మారి లా సమాజాన్ని , యువతను చెడు మార్గం వైపు నడిపిస్తుందన్నారు. వీటిని అలవాటు చేసుకోవడం వల్ల దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు కలుగుతాయనీ,అనేక సందర్భాల్లో మానసిక, శారీరక, సామాజిక పరమైన సమస్యలకు లోను కావాల్సి వస్తుందన్నారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిసగా మారడం వల్ల వారి కుటుంబాలు, దేశ సమాజం ప్రభావితం అవుతుందనీ తెలిపారు

జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మత్తుపదార్థాల వినియోగం వల్ల:ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాలు చూపుతాయనీనేర ప్రవర్తన,తో భవిష్యత్తు అవకాశాలను కోల్పోవాల్సి వస్తుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వృత్తి పరంగా, వ్యక్తిగతంగా, ఆరోగ్యంగా అభివృద్ధి చెందాలంటే మంచి అలవాట్లు అలవర్చుకుని, చెడు వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డ్రగ్స్ నిర్మూలన అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి.

### ట్రాఫిక్ నిబంధాలను పాటించాలి .. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ నవంబర్21( సమయం న్యూస్).:** జిల్లాలో రోడ్డు ప్రమాదాల వల్ల అమూల్యమైన ప్రాణ నష్టం, ఆర్థిక నష్టం జరుగుతున్న సందర్భంలో రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎస్ పి శ్రీనివాస్ రావు లు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలలో గణనీయమైన తగ్గుదల సాధ్యమని తెలిపారు. ప్రమాదాలకు ప్రధాన కారణాలుమద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ లేదా మెసేజ్‌లు టైప్ చేస్తూ డ్రైవింగ్ చేయొద్దని పేర్కొన్నారు. అతివేగం, ఓవర్‌టేకింగ్ దుర్వినియోగం, సిగ్నల్ జంపింగ్, ఓవర్‌లోడింగ్, హెల్మెట్/సీట్‌బెల్ట్ ఉపయోగించకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణంగా సూచించారు. అలసట, నిద్రమత్తు, పొగమంచు, రోడ్డుపై కనిపించే దూరం తగ్గడం వంటి పరిస్థితుల్లో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయవద్దన్నారు. డ్రైవర్లు తప్పనిసరి పాటించాల్సిన జాగ్రత్తలుమద్యం, మత్తు పదార్థాలు తీసుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనం నడపకూడదు అని వివరించారు.

డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించరాదన్నారు. ద్విచక్రవాహన దారులు మార్కు హెల్మెట్, కారు ప్రయాణికులు ముందూ వెనుకా సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. చలికాలంలో పొగమంచు ఎక్కువగా ఉన్నప్పుడు హెడ్లైట్లు, ఫాగ్ లైట్లు ఆన్‌లో ఉంచి, వాహనాల మధ్య సురక్షిత దూరం పాటించాలన్నారు. పాదచారులు, ప్రయాణికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలురోడ్డు దాటేటప్పుడు జెబ్రా క్రాసింగ్, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్, సబ్‌వేలు ఉండే చోట్లే దాటాలనీ,ఒక్కసారి రెండు వైపులా చూసి, పరుగులు పెట్టకుండా నెమ్మదిగా దాటాలన్నారు. బ్లాక్‌స్పాట్లను గుర్తించి తగిన సంకేత బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్ ఏర్పాటు చేయడం, రోడ్డు భద్రతా కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్ పి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ స్కూళ్లు, కాలేజీలలో రోడ్డు భద్రతా క్లబ్‌లు, అవగాహన సభల ద్వారా విద్యార్థుల్లో చిన్న వయసులోనే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచాలన్నారు. ప్రతి ప్రయాణం ముందు వాహనాన్ని సరిచూసుకోవడం, నిబంధనలు పాటించడం ద్వారా తాము, తమ కుటుంబాలు సురక్షితంగా ఉండగలరని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం, పోలీసు శాఖ, రోడ్డు రవాణా శాఖ చేస్తున్న చర్యలకు ప్రజలు పూర్తిగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య,జిల్లా వైద్య అధికారి శ్రీరామ్,పోలీస్,అధికారులు పాల్గొన్నారు.

# కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలియజేసిన ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్.



**నిర్మల్ నవంబర్21( సమయం న్యూస్).**జలసంచాయ్– జనభాగీదారీ అవార్డును జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఇటీవలి న్యూఢిల్లీలో కేంద్ర జల శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ చేతుల మీదుగా స్వీకరించినందున, శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లోని తన చాంబర్లో ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. జిల్లాకు ప్రతిష్టాత్మకమైన అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. డిఆర్డిఓ విజయలక్ష్మిని ఎమ్మెల్యే సన్మానించి, అభినందించారు. అంతకుముందు పలువురు ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు కలెక్టర్ ను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకు ప్రతిష్టాత్మక అవార్డు రావడంలో అధికారుల కృషి విలువైనదని అన్నారు. మున్ముందు రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తూ జిల్లా జాతిని మరింత నిలిపేలా తోడ్పాటును అందించాలని తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్



**హన్వాడ నవంబర్ 21( సమయం న్యూస్) :** హన్వాడ మండల కేంద్రం లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం తనిఖీ చేశారు కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా తెలుసుకున్నారు ధాన్యం తేమ శాతంను పరీక్షించారు. నిర్ణీత తేమ,తాలు,మట్టి లేకుండా నాణ్యతా ప్రమాణాలు ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రం లో ధాన్యం వివరాలు,ట్యాబ్ ఎంట్రీ గురించి కలెక్టర్ అడిగారుఇప్పుడు 2514 బస్తాల ధాన్యం ఉంది ట్యాబ్ ఎంట్రీ 1566 బస్తా లకు పూర్తి అయిందని కొనుగోలు కేంద్రం నిర్వాహకులుతెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తూకం వేసిన వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు– రవాణా పరంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని,కొనుగోలు తర్వాత కేంద్రం నిర్వాహకులదే బాధ్యత అని,రైతులు మిల్లుకు వెళ్ళే అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్ లను వినియోగించుకుంటున్నారా?కలెక్టర్ అడిగారు. .ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్ లకు కొద్దిగా రిపేరింగ్ చేయాల్సి ఉందని కేంద్రం ఇంచార్జి తెలుపగా ఆటోమేటిక్ ప్యాడి క్లీనింగ్ పరిశీలించి వెంటనే రిపేరింగ్ చేయించాలని ఆదేశించారు.కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,ఆర్.డి.ఓ నవీన్ తదితరులు ఉన్నారు

# ఉత్సాహభరితంగా స్పోర్ట్స్ ఫెస్టివల్

**హైదరాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 21(సమయం న్యూస్):**



తెలంగాణ–నార్త్ ఈస్ట్ కనెక్ట్ కార్యక్రమాల భాగంగా నిర్వహించిన స్పోర్ట్స్ ఫెస్టివల్ తెలంగాణలో ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా కొనసాగింది. గోపీచంద్ అకాడమీలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీలకు గవర్నర్ విష్ణు దేవ్ వర్మ ప్రారంభ గౌరవం వహించారు. తెలంగాణ వర్సెస్ నార్త్ ఈస్ట్ జట్ల మధ్య బాయ్స్, గర్ల్స్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, ఈశాన్య రాష్ట్రాలు మరియు తెలంగాణకు గ్రామీణ క్రీడలకు ఉన్న బలమైన నేపథ్యం, రెండు ప్రాంతాల క్రీడా సంస్కృతికి సామీప్యతను సూచిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ % మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవి, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, గోపీచంద్ అకాడమీ సిబ్బంది, బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు. తదనంతరం గచ్చిబౌలి స్టేడియంలో నార్త్ ఈస్ట్–తెలంగాణ స్పోర్ట్స్ ఎంటర్ ప్రెన్యూర్స్, క్రీడా జర్నలిస్టుల సమావేశం నిర్వహించబడింది. అదేవిధంగా ఈశాన్య రాష్ట్రాల అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీతల ఆధ్వర్యంలో ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, సెపక్ తక్రా, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడా విభాగాల్లో స్పెషల్ కోచింగ్ క్లినిక్స్ నిర్వహించారు. గచ్చిబౌలి మెయిన స్టేడియంలో జరిగిన ఫుట్‌బాల్ పోటీలలో, మహిళల విభాగంలో తెలంగాణ జట్టు 2–0 గోల్స్‌తో ఈశాన్య రాష్ట్రాల జట్టుపై విజయం సాధించింది. పురుషుల విభాగంలో ఈశాన్య రాష్ట్రాల జట్టు 2–0 తో తెలంగాణపై విజయం నమోదుచేసింది. ఈ పోటీలను ఇండియన్ ఫుట్‌బాల్ లెజెండ్ బూటియా, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ప్రారంభించారు.

విజేతలకు మిజోరం క్రీడా శాఖ మంత్రి లౌలింగ్ లోవా హమారా, క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, ఈశాన్య రాష్ట్రాల అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు బహుమతులు అందజేశారు.

# డొంకేశ్వర్ లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- తహసీల్దార్ కార్యాలయం, రైతు వేదిక, కొనుగోలు కేంద్రం సందర్శన
- భూభారతి దరఖాస్తులపై సమీక్ష
- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పెండింగ్ ఆర్జీలపై ఆరా



**నిజామాబాద్, నవంబర్ 21( సమయం న్యూస్).** డొంకేశ్వర్ మండల కేంద్రంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై ఒక్కో గ్రామం వారీగా రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్ లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి, ఎంతమందికి నోటీసులు ఇచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియకు అనుగుణంగా ఆన్ లైన్లో అన్ని అంశాలను అప్లోడ్ చేశారా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించాలని అన్నారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులకు సంబంధించి, స్పష్టమైన కారణాలను పేర్కొనాలని సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సన్నాహక ప్రక్రియను చేపడుతున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. గడువు లోపు ఎస్.ఐ.ఆర్ పూర్తి చేయాలని అన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ మంజూరీలపై ఆరా తీశారు. దరఖాస్తులు అందిన వెంటనే అర్హులైన వారిని గుర్తిస్తూ వెంటవెంటనే మంజూరీ జాబితాలు పంపాలని ఆదేశించారు. ఆధార్ అవసరం అయిన విద్యార్థులకు జనన ధృవీకరణ పత్రాలను సత్వరమే మంజూరు చేయాలని అన్నారు. అనంతరం కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం సేకరణ తీరును పరిశీలించారు. ఇంకనూ పది శాతం వరకు వరి కోతలు మిగిలి ఉన్నాయని నిర్వాహకులు తెలుపగా, రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి మిల్లులకు తరలించాలని కలెక్టర్ సూచించారు. మిల్లుల వద్ద దొడ్డు రకం ధాన్యం సైతం సకాలంలో దిగుమతి చేసుకునేలా చూడాలని, ఒకవేళ ఎక్కడైనా అన్ లోడింగ్ చేసుకోకపోతే నేరుగా తన దృష్టికి తేవాలని కలెక్టర్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా, సకాలంలో ట్రక్ షీట్లు తెప్పించుకుని ట్యాబ్ ఎంట్రీలు చేయించాలని, తద్వారా రైతుల ఖాతాలలో వెంటనే బిల్లులు జమ అవుతాయని అన్నారు. కాగా, రైతు వేదికను సందర్శించిన సందర్భంగా కలెక్టర్ స్థానిక రైతులతో భేటీ అయ్యారు. ధాన్యం అమ్మకాల విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యాయా అని ఆరా తీయగా, అలాంటిదేమీ లేదని ధాన్యం అమ్మకాలు సాఫీగా జరిగాయని రైతులు తెలిపారు. వరితో పోలిస్తే అధిక ఆదాయాన్ని అందించే ఆయిల్ పామ్ పంట సాగుపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని గుర్తు చేశారు. రబీ సీజన్ కు సంబంధించి కూడా రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా ఇప్పటి నుండే ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ నరేష్ కుమార్, మండల వ్యవసాయ అధికారి మధుసూదన్ తదితరులు ఉన్నారు.

# నాడు పాడుబడ్డ భవనం - నేడు రోజుకి 3 పెద్దాపరేషన్ చేసే పేదల ఆసుపత్రి.

- కమ్యూనిటీ హెల్త్ సెంటర్ చర్ల సేవలు అమోఘం.
- జిల్లా కలెక్టర్ , MLA డా తెల్లంవెంకట్రావు, DCHS డా రవి బాబు ప్రత్యేక కృషి



**చర్ల నవంబర్21( సమయం న్యూస్).:** 3 సంవత్సరాక క్రితం పాడుబడ్డ భవనం లాగా ఉన్న చర్ల ఆసుపత్రి నేడు అన్ని వసతులతో నీరుపేద వారికి సంజీవనిలా మారింది. జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ సహకారం, డాక్టర్ రవి బాబు ప్రత్యేక శ్రద్ధ, భద్రాచలం శాసన సభ్యులు డా తెల్లం వెంకటరావు సూచనలు వెరసి చర్ల ఆసుపత్రి పరిసర ప్రజలతో పాటు పక్కనున్న ఛతీస్ఘడ్ ప్రజల మన్ననలు సైతం పొందుతోంది. కేవలం ఒక సంవత్సర కాలంలో అంచలంచలుగా ఎదుగుతూ కేవలం ఎంబీబీఎస్,డెంటల్ డాక్టర్స్ తో నడిచిన ఆసుపత్రి నేడు నలుగురు స్పెషలిస్ట్ డాక్టర్స్ తో సేవలు అందిస్తోంది. మారుమూల ప్రాంతమైనా నేపథ్యం లో ప్రత్యేక శ్రద్ధ వహించినా జిల్లా కలెక్టర్ జితేశ్ పాటిల్ ఆసుపత్రి కి కావాల్సిన స్పెషలిస్ట్ వైద్యులు, మౌలిక సదుపాయాలు, డయాలిసిస్ సేవలు, పోస్ట్ మార్టమ్ సేవలు, సానిటేషన్ సేవలు, ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు, జనరేటర్ ఏర్పాటు కి జిల్లా మంత్రులు,స్థానిక శాసనసభ్యుల సమన్వయం తో ఏర్పాటు చేశారు. ఈ సదుపాయాలతో స్థానికులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయి. నాడు డయాలిసిస్ కోసం, ప్రసూతి సేవలు,కుటుంబ నియంత్రణ సేవలు, పోస్ట్ మార్టెం సేవల కోసం భద్రాచలం వరకు అరవై కిలోమీటర్లు ప్రయాణించినా రోగులు నేడు స్థానికంగానే సేవలు పొందుతున్నారు. ప్రస్తుతం పదహారు మంది డయాలిసిస్ రోగులు చికిత్స పొందుతున్నారు.నేడు ఒక రోజే 3 పెద్దపరేషన్ లు జరిగాయి అంటేనే ఆసుపత్రి పట్ల ప్రజల నమ్మకం తెలుస్తుంది. ప్రసూతి వైద్యురాలు శ్రావణి,పిల్లల వైద్యుడు రవి కుమార్, మత్తు డాక్టర్ శివ రామ కృష్ణ ప్రసాద్, డాక్టర్ రామ్ ప్రసాద్ సమన్వయంతో ఆపరేషన్ కాగా రోగులు ఆపరేషన్ అనంతరం క్షేమంగా ఉన్నారు.పిల్లల వైద్య నిపుణులు కూడా అందుబాటులో ఉండడం , నిన్న రాత్రి వనవాసి హాస్టల్ విద్యార్థులకు తీవ్ర గొంతునొప్పి,జ్వరం తో వచ్చిన పిల్లలను రాత్రి పూట కూడా చికిత్స చేయడం తో ఆసుపత్రి సేవలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 10 కోట్ల తో నూతన ఆసుపత్రి భవన నిర్మాణం పనులు ప్రారంభమైన నేపథ్యం లో త్వరలోనే నూతన భవనం తో మరింత సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నది.



# కెప్టెన్‌గా రిషబ్ పంత్

## రెండో టెస్ట్ నుంచి శుభమన్ గిల్ అవుట్

శుభ్‌మన్ గిల్ అధికారికంగా భారత్ vs దక్షిణాఫ్రికా రెండో టెస్ట్ నుంచి వైదొలిగాడు. కోల్‌కతాలో జరిగిన మొదటి టెస్ట్ రెండో రోజున మెడ నొప్పి కారణంగా మైదానాన్ని వీడాడు. అతని నొప్పి చాలా ఎక్కువగా ఉండటంతో ఆసుపత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది. అతను రెండో ఇన్నింగ్స్‌లో కూడా బ్యాటింగ్ చేయలేకపోయాడు. గువాహటిలో జట్టుతో చేరిన గిల్ ఆడటంపై ముందే సందేహం ఉంది, కానీ ఇప్పుడు ఒక ప్రకటన విడుదల చేసి దీన్ని ధృవీకరించింది. అతని స్థానంలో రిషబ్ పంత్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. తన ప్రకటనలో,"దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి టెస్ట్‌లో మెడ నొప్పికి గురైన టీమ్ ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్, గువాహటిలో జరిగే రెండో టెస్ట్ నుంచి వైదొలిగాడు. గిల్ కోల్‌కతా టెస్ట్ రెండో రోజున మెడ నొప్పికి గురయ్యాడు. ఆట ముగిసిన తర్వాత పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అతన్ని పరిశీలనలో ఉంచారు. మరుసటి రోజు డిశ్చార్జ్ చేశారు. అతను నవంబర్ 19, 2025న గువాహటికి వెళ్లాడు. దురదృష్టవశాత్తు, అతను రెండో టెస్ట్‌లో ఆడటానికి పూర్తిగా ఫిట్‌గా లేదు. తన గాయం గురించి మరింత పరీక్షల కోసం ముంబైకి వెళ్తాడు. గిల్ లేకపోవడంతో రిషబ్ పంత్ రెండో టెస్ట్‌లో జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు." టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదికల ప్రకారం.. శుభ్‌మన్ గిల్ ప్రస్తుతం ముంబైలో రెండు నుంచి మూడు రోజులు విశ్రాంతి తీసుకుని, ఆ తర్వాత ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ దినషా పర్దివాలా నుంచి మెడ నొప్పికి సంబంధించి ప్రత్యేక సలహా తీసుకోనున్నాడు.కోల్‌కతాలో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లోనే గిల్‌కు గాయమైంది.మ్యాచ్ రెండవ రోజున బ్యాటింగ్‌కు వచ్చిన వెంటనే, కొన్ని బంతులు ఎదుర్కొన్న తర్వాత మెడలో తీవ్రమైన అసౌకర్యాన్ని అనుభవించాడు. ఫిజియో వచ్చి పరీక్షించిన తర్వాత, అతను రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాల్సి వచ్చింది. గాయం తీవ్రత దృష్ట్యా, అతన్ని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆ మ్యాచ్‌లో అతను మళ్లీ ఆడలేదు. జట్టుతో కలిసి గువహాటి వచ్చినా, చివరకు రెండో టెస్ట్‌కు దూరమయ్యాడు.శుభ్‌మన్ గిల్ దూరమవడంతో అతని స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ జట్టు కెప్టెన్సీని చేపట్టనున్నారు. అయితే ప్లేయింగ్ ఎలెవన్‌ను ఎంపిక చేయడంలో గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని జట్టు మేనేజ్‌మెంట్‌కు కొన్ని ముఖ్యమైన సవాళ్లు ఎదురవుతున్నాయి. శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో సాయి సుదర్శన్ లేదా నితీష్ కుమార్ రెడ్డిలలో ఒకరికి అవకాశం దక్కవచ్చు. అదనపు స్పిన్నర్ అక్షర్ పటేల్‌ను బెంచ్‌కే పరిమితం చేసే అవకాశం ఉంది. మ్యాచ్‌కు ముందు జరిగిన నెట్ ప్రాక్టీస్‌లో కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్ మాత్రమే పాల్గొన్నారు.గిల్ తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకుని టెస్ట్‌లో ఆడాలనుకున్నప్పటికీ, జట్టు యాజమాన్యం అతని భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎటువంటి రిస్క్ తీసుకోవడానికి సిద్ధంగా లేదు. దక్షిణాఫ్రికాతో భారత జట్టు నవంబర్ 29 నుంచి వన్డే సిరీస్ కూడా ఆడాల్సి ఉంది. అయితే గిల్ ప్రస్తుతం మెడ నొప్పితో బాధపడుతున్నందున, ఆ వన్డే సిరీస్‌లో అతను పాల్గొంటాడా లేదా అనే విషయంపై ఇంకా అధికారికంగా ఎటువంటి స్పష్టత లేదు.

## గౌహతి మైదానం నాకు చాలా ఇష్టం

### నా వన్డే అరంగేట్రం ఇక్కడే జరిగింది : రిషభ్ పంత్

భారత్, సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో రెండవ మ్యాచ్ రేపటి నుంచి గౌహతిలో ప్రారంభం కానుంది. మొదటి టెస్ట్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగింది. ఆ మ్యాచ్‌లో సౌతాఫ్రికా 30 పరుగుల తేడాతో గెలిచింది. ఈడెన్ గార్డెన్స్ పిచ్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో గౌహతి పిచ్ కూడా స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంపై భారత కెప్టెన్ రిషభ్ పంత్ ఒక పెద్ద స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈసారి పిచ్ మెరుగ్గా ఉంటుందని తాను ఆశిస్తున్నానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రెండవ టెస్ట్ మ్యాచ్ ప్రారంభానికి ముందు జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో రిషభ్ పంత్ మాట్లాడారు. "ఈ మైదానం (గౌహతి) నాకు చాలా ఇష్టం అని ముందుగా చెప్పాలనుకుంటున్నాను. నా వన్డే అరంగేట్రం ఇక్కడే జరిగింది. అంతేకాదు టెస్ట్ టీమ్‌కు కెప్టెన్‌గా నా అరంగేట్రం కూడా ఈ మైదానంలోనే మొదలవుతోంది. అందుకే ఈ స్థలం నాకు, అలాగే గౌహతి మొత్తానికి చాలా ప్రత్యేకం. ఎందుకంటే ఇక్కడ తొలిసారి టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది" అని పంత్ భావోద్వేగంగా చెప్పారు. పిచ్ గురించి మాట్లాడుతూ.. పంత్ సానుకూలత వ్యక్తం చేశారు. "పిచ్ విషయానికి వస్తే ఈసారి పిచ్ మెరుగ్గా ఉంటుందని నేను అనుకుంటున్నాను. ముఖ్యంగా బ్యాటింగ్‌కు ఇది బాగా అనుకూలించే అవకాశం ఉంది. కొన్ని రోజుల తర్వాత పిచ్ టర్న్ అయ్యే అవకాశం ఉంది. కానీ నా ఉద్దేశంలో ఇది ఒక మంచి టెస్ట్ మ్యాచ్‌గా ఉంటుంది" అని పంత్ నమ్మకంగా చెప్పారు. అంటే మొదటి రోజు నుంచే పిచ్ స్పిన్నర్లకు పట్టు ఇవ్వకుండా.. బ్యాట్స్‌మెన్‌లకు కూడా అవకాశం ఇస్తుందని పంత్ టీమ్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించినందుకు పంత్ ఈ సందర్భంగా బీసీసీఐకి మరోసారి ధన్యవాదాలు తెలిపారు. "కొన్నిసార్లు మనం పెద్ద మ్యాచ్ గురించి ఎక్కువగా ఆలోచిస్తే దాని వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. అందుకే నేను ఎక్కువగా ఆలోచించదలుచుకోలేదు. మొదటి టెస్ట్ మాకు బాగా ఆడలేదు. అందుకే రెండవ టెస్ట్‌లో గెలవడానికి అవసరమైనదంతా చేస్తాం" అని పంత్ పేర్కొన్నారు. కోల్‌కతా ఓటమిని మర్చిపోయి.. ఈ టెస్ట్‌లో ఎలాగైనా గెలిచి సిరీస్‌ను సమం చేయాలని టీమిండియా పట్టుదలగా ఉంది.

# తొలిరోజే అభిమానులకు థ్రిల్

- పూర్తిగా ఆధిపత్యం కనిపించిన బౌలర్లు
- 172 పరుగులకే ఇంగ్లాండ్ ఆలౌట్
- ఇంగ్లాండ్? నడ్డివిరిచిన మిచెల్ స్టార్క్
- 7 వికెట్లతో ఆదరహో అనిపించుకున్న స్టార్క్
- ఇంగ్లాండ్ బౌలర్లు దీటుగా సమాధానం
- ఆసీస్ మొదటి ఇన్నింగ్స్‌లో 123-9
- బెన్ స్టోక్స్ ధాటికి కుదేలైన ఆసీస్ బ్యాటర్లు
- స్టోక్స్ కేవలం 6 ఓవర్లలోనే 5 వికెట్లు
- రసవత్తరంగా సాగుతున్న యాషెస్ సిరీస్



యాషెస్ సిరీస్ 2025లో పెర్త్ వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ మొదటి రోజు అసాధారణ రీతిలో చరిత్ర సృష్టించింది. ఈ రోజు మొత్తం బౌలర్ల ఆధిపత్యమే నడిచింది. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ 7 వికెట్లతో విజృంభించగా.. ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ కేవలం 6 ఓవర్లలోనే 5 వికెట్లు పడగొట్టడంతో టెస్ట్ క్రికెట్‌లో అరుదైన రికార్డు నమోదైంది. మొదటి రోజు ఆటలో ఏకంగా 19 వికెట్లు నేలకూలాయి.యాషెస్ సిరీస్ చరిత్రలో గత 100 ఏళ్లలో టెస్టు మ్యాచ్ తొలి రోజున 19 వికెట్లు పడటం ఇదే మొదటిసారి. అంతకుముందు 1909లో ఓల్డ్ ట్రాఫర్డ్ మైదానంలో తొలి రోజు 18 వికెట్లు నేలకూలాయి. పెర్త్‌లో ఒక టెస్ట్ మొదటి రోజు అత్యధిక వికెట్లు పడటం కూడా ఇదే తొలిసారి. గతంలో 2024లో భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్‌లో 17 వికెట్లు పడ్డాయి.టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ జట్టు మిచెల్ స్టార్క్ (7 వికెట్లు) విధ్వంసకర బౌలింగ్ వల్ల 172 పరుగులకే ఆలౌట్ అయింది.హ్యారీ బ్రూక్ (52), ఓలీ పోప్ (46) మాత్రమే కొంత పోరాటాన్ని చూపగా.. మిగతా బ్యాటర్లు స్టార్క్ ధాటికి తలవంచారు.ఇంగ్లండ్‌ను స్వల్ప స్కోరుకే పరిమితం చేసిన తర్వాత, బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా పరిస్థితి మరింత దయనీయంగా మారింది. రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా కేవలం 123 పరుగులకే 9 వికెట్లు కోల్పోయి బ్యాక్‌ఫుట్‌లో పడింది.ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ తన బౌలింగ్‌తో మెరిశాడు. బెన్ స్టోక్స్ కేవలం 6 ఓవర్ల స్పెల్‌లో 23 పరుగులు మాత్రమే ఇచ్చి ఏకంగా 5 కీలక వికెట్లు పడగొట్టాడు.ఆసీస్ బ్యాటర్లు స్టీవ్ స్మిత్ (17), ట్రావిస్ హెడ్ (21), కామెరూన్ గ్రీన్ (24)తో పాటు మరో ఇద్దరు కీలక బ్యాటర్లను స్టోక్స్ పెవిలియన్ చేర్చాడు. జోఫ్రా ఆర్చర్ కూడా జోస్యం చేసి జేక్ వెదెరాల్డ్‌ను (0) తొలి బంతికే ఔట్ చేయగా, లబుషేన్ (9), ఖవాజా (2) తక్కువ స్కోరుకే ఔటయ్యారు. రోజు ఆట ముగిసే సమయానికి నాథన్ లయన్ (3), బ్రెండన్ డాగెట్ (0) క్రీజులో ఉన్నారు. కెప్టెన్ స్టోక్స్ స్పెల్ కారణంగా ఆస్ట్రేలియా తమ తొలి ఇన్నింగ్స్‌లో కూడా ఆధిక్యాన్ని సాధించడంలో విఫలమైంది. ఆసీస్ స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ అద్భుతంగా ప్రదర్శన చేయడంతో ఇంగ్లండ్ జట్టు తమ మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 172 పరుగులకే ఆలౌటైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్‌కు ఆరంభంలోనే భారీ షాక్ తగిలింది. దూకుడుగా ఆడే 'బేజ్‌బాల్' వ్యూహాన్ని అమలు చేయాలని భావించిన ఇంగ్లండ్‌కు ఆస్ట్రేలియా పేస్ ఎటాక్ ఆదిలోనే కళ్లెం వేసింది.ఇంగ్లండ్ బ్యాటర్లలో అత్యధికంగా పరుగులు చేసింది ఇద్దరే కావడం గమనార్హం. హ్యారీ బ్రూక్ (52 పరుగులు) తనదైన శైలిలో దూకుడుగా ఆడి అర్ధ సెంచరీ పూర్తి చేసి జట్టుకు కొంత ఉపశమనం అందించాడు. ఓలీ పోప్ (46 పరుగులు) కూడా బ్రూక్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టేందుకు గట్టి పోరాటం చేశాడు. వీరితో పాటు జెమీ స్మిత్ (33), ఓపెనర్ బెన్ డకెట్ (21) ఫర్వాలేదనిపించినా.. మిగతా బ్యాటర్లంతా ఆసీస్ పేస్ దాడి ముందు చేతులెత్తేశారు. కెప్టెన్ బెన్ స్టోక్స్ సహా కీలక బ్యాటర్లు తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరడంతో ఇంగ్లండ్ భారీ స్కోరు సాధించలేకపోయింది. ఇంగ్లండ్ పతనంలో ప్రధాన పాత్ర పోషించింది ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్. తన పదునైన స్వింగ్, వేగంతో ఇంగ్లండ్ బ్యాటింగ్ ఆర్డర్‌ను స్టార్క్ కూల్చేశాడు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 7 వికెట్లు పడగొట్టగా.. బ్రెండన్ డొగ్గెట్ 2 వికెట్లు, క్యామెరాన్ గ్రీన్ ఒక వికెట్ తీశాడు. స్టార్క్ ఏకంగా 7 వికెట్లు తీయడం ఆస్ట్రేలియాకు బలమైన ఆరంభాన్ని ఇచ్చింది. దీంతో ఇంగ్లండ్ జట్టు 172 పరుగులకే తమ ఇన్నింగ్స్‌ను ముగించింది.ఇంగ్లండ్ స్వల్ప స్కోరుకే ఆలౌట్ కావడంతో, ఆస్ట్రేలియా బ్యాటింగ్ ప్రారంభించి, తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యాన్ని సంపాదించేందుకు సిద్ధమవుతోంది. యాషెస్ ఆరంభంలోనే పైచేయి సాధించిన ఆసీస్, ఇంగ్లండ్‌పై ఒత్తిడిని మరింత పెంచింది.



## రెండు లేదా మూడు నెలలు శ్రేయస్ ఆటకు దూరం



టీమిండియా స్టార్ బ్యాటర్, వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు గాయం కారణంగా మరోసార ఎదురుదెబ్బ తగిలింది. శ్రేయస్ అయ్యర్ గాయం కారణంగా క్రికెట్‌కు చాలా కాలం దూరంగా ఉండబోతున్నాడు. కడుపులో అంతర్గత గాయం నుంచి కోలుకుంటున్న శ్రేయస్ అయ్యర్.. రాబోయే దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌లతో జరిగే వన్డే సిరీస్‌లను కోల్పోవడం ఖాయంగా కనిపిస్తోంది. తాజా వైద్య నివేదికల ప్రకారం.. శ్రేయస్ అయ్యర్ పూర్తిస్థాయి పునరాగమనం కోసం కనసం రెండు లేదా మూడు నెలలు పట్టే అవకాశం ఉంది. ఈ సమయంలో శ్రేయస్ అయ్యర్ కచ్చితమైన గ్రేడెడ్ రిహాబిలిటేషన్ ప్రోగ్రామ్‌ను మాత్రమే అనుసరించాలని వైద్యులు సూచించారు. ఆస్ట్రేలియా వన్డే సిరీస్ సమయంలో గాయమైనప్పటి నుంచి శ్రేయస్ అయ్యర్ విశ్రాంతి తీసుకుంటున్నాడు.అక్టోబర్ 25న సిడ్నీలో ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డే మ్యాచ్‌లో క్యాచ్ తీసుకునే ప్రయత్నంలో శ్రేయస్ అయ్యర్ అసాధారణంగా కింద పడ్డాడు. ఈ ప్రమాదం వల్ల అతనికి కడుపులో గాయం అయి, అంతర్గత రక్తస్రావం జరిగి, ప్లీహం పైన గాయం ఏర్పడింది. రక్తస్రావాన్ని ఆపడానికి చికిత్స చేసిన తర్వాత పరిస్థితి స్థిరపడే వరకు అతన్ని ఐసీయూలో పర్యవేక్షణలో ఉంచారు.ఇండియాకు తిరిగి వచ్చినప్పటి నుంచి శ్రేయస్ అయ్యర్ నిరంతర వైద్య పర్యవేక్షణలో ఉన్నారు. ఈ వారం ప్రారంభంలో అతనికి అల్ట్రాసౌండ్ స్కాన్ నిర్వహించగా.. ఆ ఫలితాలను ప్రముఖ స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ దినషా పర్దివాలా పరిశీలించారు. తాజా స్కాన్ ఫలితాలు సానుకూలంగా ఉండటం, అయ్యర్ కోలుకోవడం స్థిరంగా ఉందని సూచించింది.ప్రస్తుత పరీక్షల ఫలితాల ఆధారంగా శ్రేయస అయ్యర్ ప్రాథమిక ఐసోమెట్రిక్ వ్యాయామాలు, సాధారణ దైనందిన కార్యకలాపాలను తిరిగి ప్రారంభించడానికి అనుమతి పొందారు. ప్లీహం గాయం మరింత తీవ్రం కాకుండా ఉండేందుకు కడుపుపై ఒత్తిడి పెంచే ఏ విధమైన శిక్షణనూ కనీసం తదుపరి ఒక నెల పాటు చేయకూడదని సూచించారు. అతని పునరావాస ప్రణాళికలో భాగంగా, రెండు నెలల తర్వాత రెండో అల్ట్రాసౌండ్ స్కాన్ నిర్వహిస్తారు. ఆ తదుపరి స్కాన్ ఫలితాల ఆధారంగా మాత్రమే బీసీసీఐసెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో రిహాబిలిటేషన్ ప్రారంభించడానికి అనుమతిస్తారు.ఈ గడువును బట్టి చూస్తే శ్రేయస్ అయ్యర్ కనీసం మరో రెండు లేదా మూడు నెలల పాటు ఆటకి దూరంగా ఉంటాడని స్పష్టమవుతోంది. దీంతో శ్రేయస్ అయ్యర్ రాబోయే దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌లతో జరిగే వన్డే సిరీస్‌లను కోల్పోవడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రస్తుతానికి 29 ఏళ్ల ఈ ఆటగాడు పూర్తిగా, సురక్షితంగా కోలుకోవడానికే అధిక ప్రాధాన్యత ఇవ్వబడుతోంది.

## మీర్‌పూర్‌లో స్టేడియంలో భూకంపం

### స్టేడియంలో వణికిపోయిన ప్రేక్షకులు!

క్రికెట్‌లో అప్పుడప్పుడు వెలుతురు లేకపోవడం లేదా వర్షం కారణంగా మ్యాచ్‌లు నిలిచిపోవడం చూస్తుంటాం. కానీ బంగ్లాదేశ్, ఐర్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌ను ఆతిథ్య జట్టు ఎప్పుడూ ఊహించని కారణంతో ఆపాల్సి వచ్చింది. మీర్‌పూర్‌లోని షేర్-ఎ-బంగ్లా నేషనల్ స్టేడియంలో శుక్రవారం జరుగుతున్న రెండో టెస్ట్ మూడో రోజు మొదటి సెషన్ సందర్భంగా భూకంపం రావడంతో ఆటను నిలిపివేశారు.కామెంటరీ బాక్సులో ఉన్న కామెంటేటర్లు కూడా భూకంపం వచ్చినట్లు ధ్రువీకరించారు. స్టేడియంలో ప్రకంపనలు రావడంతో ఐర్లాండ్ ఆటగాళ్లు వెంటనే తమ డ్రెస్సింగ్ రూమ్ నుంచి బయటకు వచ్చి బౌండరీ లైన్ వద్ద గుమిగూడారు. స్టాండ్స్‌లో కూర్చున్న ప్రేక్షకులు కూడా కొద్దిగా ఆందోళనకు గురయ్యారు. అయితే కొన్ని నిమిషాల తర్వాత ప్రకంపనలు ఆగిపోవడంతో మ్యాచ్ తిరిగి ప్రారంభమైంది.ఆట నిలిచిపోయే సమయానికి ఐర్లాండ్ జట్టు 98 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో ఉంది. ఆ దశలో స్టీఫెన్ డోహెనీ, లోర్కాన్ టకర్ నిలకడగా ఆడి జట్టు స్కోరును 113 పరుగులకు చేర్చారు. వీరిద్దరూ కలిసి 81 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఇది ఐర్లాండ్ జట్టును పతనం అంచు నుంచి కాపాడింది. ఆ తర్వాతే భూకంపం ఢాకాను తాకింది.రెండో రోజు ఆటలో బంగ్లాదేశ్ బ్యాటర్లు ముష్ఫికర్ రహీమ్, లిట్టన్ దాస్ సెంచరీలు సాధించడంతో బంగ్లాదేశ్ జట్టు పటిష్టమైన స్థితికి చేరుకుంది. 5 వికెట్లకు 340 పరుగులతో రెండో రోజు ఆటను ముగించిన బంగ్లాదేశ్, మూడో రోజు 476 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. ముష్ఫికర్ రహీమ్ తన 13వ టెస్ట్ సెంచరీని పూర్తి చేశాడు. అంతేకాకుండా తన 100వ టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీ చేసిన ప్రపంచంలో పదకొండో క్రికెటర్‌గా రికార్డు సృష్టించాడు. అతను 106 పరుగుల వద్ద ఔటయ్యాడు. లిట్టన్ దాస్ కూడా దూకుడుగా ఆడి, ఒక సిక్సర్, ఒక ఫోర్‌తో తన సెంచరీని పూర్తి చేశాడు.



## ఆఖరికి వైడ్ బాల్‌తో గెలిచి ఫైనల్‌కు వెళ్లిన బంగ్లాదేశ్

రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ 2025లో తొలి సెమీ-ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠకు పరాకాష్టగా నిలిచింది. ఈ మ్యాచ్‌ను ఒక సాధారణ క్రికెట్ మ్యాచ్ అని కాకుండా ట్విస్టులు, ఉత్కంఠ, చివరికి ఊహించని ఫలితం ఇచ్చిన డ్రామా సినిమా అని చెప్పవచ్చు. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 194 పరుగులు చేయగా, దానికి సమాధానంగా టీమిండియా A కూడా సరిగ్గా 194 పరుగులే చేసి మ్యాచ్‌ను టై చేసింది. అయితే, సూపర్ ఓవర్ లో మాత్రం భారత్‌కు దారుణ అనుభవం ఎదురైంది. ఆఖరికి ఒకే ఒక్క వైడ్ బాల్ కారణంగా బంగ్లాదేశ్ అద్భుత విజయం సాధించి ఫైనల్‌లోకి అడుగుపెట్టింది. ఈ ఓటమితో టోర్నమెంట్‌లో భారత్ ప్రయాణం ముగిసింది. 195 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన భారత్ జట్టుకు ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ, ప్రియాన్ష్ ఆర్య మంచి ఆరంభాన్ని ఇచ్చారు. వైభవ్ సూర్యవంశీ (15 బంతుల్లో 38 రన్స్), ప్రియాన్ష్ ఆర్య (23 బంతుల్లో 44 రన్స్) మెరుపు ఇన్నింగ్స్‌లతో దూసుకుపోయారు. ఆ తర్వాత కెప్టెన్ జితేష్ శర్మ కూడా 23 బంతుల్లో 33 పరుగులు చేసి పోరాడాడు.చివరి 6 బంతుల్లో భారత్‌కు గెలవడానికి 16 పరుగులు అవసరం కాగా, అశుతోష్ మూడవ బంతికి సిక్సర్, నాలుగో బంతికి ఫోర్ కొట్టి ఉత్కంఠను పెంచాడు. ఆఖరి బంతికి హర్ష్ దూబే 3 పరుగులు తీయడంలో విజయం సాధించడంతో స్కోరు 194 పరుగుల వద్ద నిలిచి మ్యాచ్ టై అయింది. మ్యాచ్ టై అవ్వడంతో విజేతను నిర్ణయించడానికి సూపర్ ఓవర్ అనివార్యమైంది. అయితే ఈ చిన్న పోరాటంలో భారత జట్టు దారుణంగా విఫలమైంది. సూపర్ ఓవర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన భారత్ A జట్టు తరఫున కెప్టెన్ జితేష్ శర్మ, ఆశుతోష్ శర్మ కనీసం ఒక్క పరుగు కూడా చేయకుండానే తొలి రెండు బంతులకే ఔట్ అయ్యారు. దీంతో భారత ఇన్నింగ్స్ సున్నా పరుగులకే ముగిసింది. కేవలం ఒకే ఒక్క పరుగు లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ కూడా సూపర్ ఓవర్ లో తొలి బంతికే యాసిర్ అలీ వికెట్ కోల్పోయింది. అయితే, అదృష్టం బంగ్లాదేశ్ వైపు ఉండటంతో భారత బౌలర్ వేసిన రెండో బంతి వైడ్ అంపైర్ ప్రకటించారు. దీంతో వైడ్ ద్వారా వచ్చిన ఆ ఒక్క పరుగుతో బంగ్లాదేశ్ A జట్టు ఉత్కంఠభరితమైన ఈ సెమీ-ఫైనల్‌లో విజయం సాధించి నేరుగా ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. గుర్జప్నీత్ సింగ్ 2 వికెట్లు తీసినా వైభవ్ సూర్యవంశీ (38), ప్రియాన్ష్ ఆర్య (44), జితేష్ (33) బాగా ఆడినా చివరికి సూపర్ ఓవర్‌లో వైడ్ బాల్ రూపంలో వచ్చిన అదృష్టం బంగ్లాదేశ్‌ను గెలిపించింది.

# నాస్తిక వాదనలు అర్థం లేనివి

## రాజమౌళికి అండగా నిలబడ్డ ఆర్జీవి





దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి ఇటీవల తాను దేవుడిపై పెద్దగా నమ్మకం లేదని చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. గ్లోబ్ ట్రాటర్ సినిమా ఈవెంట్‌లో ఆయన చేసిన ఈ కామెంట్స్‌పై పలు హిందూ సంఘాలు, బీజేపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ వివాదంపై తాజాగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. రాజమౌళికి మద్దతుగా నిలడడమే కాకుండా విమర్శకులకు గట్టి కౌంటర్ ఇచ్చాడు. రాజమౌళిపై విషం కక్కుతున్న సోకాల్డ్ ధర్మ రక్షకులు తెలుసుకోవాల్సింది ఏంటంటే? భారతదేశంలో నాస్తికుడిగా ఉ ండటం నేరం కాదు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 దేవుడిని విశ్వసించకపోవడాన్ని కూడా రక్షిస్తుంది. అందుకే, మీరు దేవుడిని నమ్ముతున్నామని చెప్పే హక్కు మీకు ఎంత ఉందో, రాజమౌళికి కూడా తనకు దేవుడిపై నమ్మకం లేదని చెప్పే హక్కు అంతే ఉంది. అయితే రాజమౌళి దేవుడిని నమ్మకపోతే తన సినిమాల్లో దేవుడిని ఎందుకు చూపిస్తున్నాడు? అనేది మూర్ఖపు వాదన. ఆ లెక్కన, గ్యాంగ్‌స్టర్ సినిమా తీయాలంటే దర్శకుడు గ్యాంగ్‌స్టర్‌గా మారాలా? హారర్ సినిమా కోసం దెయ్యంగా మారాలా? అని ఆర్జీవీ విమ-ర్శకులను ప్రశ్నించారు. నిజం చెప్పాలంటే? రాజమౌళి దేవుడిని నమ్మకపోయినా చాలా మంది దేవుడిని నమ్మేవారు కూడా తమ జీవితాల్లో చూడనంత విజయం, సంపద నాస్తికుడైన రాజమౌళికి ఇచ్చాడు. దీనిని బట్టి చూస్తే దేవుడు నాస్తికులనే ఎక్కువగా ప్రేమిస్తున్నాడేమో, లేదా దేవుడు అసలు జనాలను పట్టించుకోడేమో? లేదంటే ఎవరు నమ్ముతున్నారని లెక్కలు రాసుకునే నోట్‌ప్యాడ్ పట్టుకొని దేవుడు కూర్చోలేదేమో? అని ఆర్జీవీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రాజమౌళితో దేవుడికే సమస్య లేనప్పుడు, ఈ స్వయం ప్రకటిత ధర్మ రక్షకులైనవారు ఎందుకు బీపీ, అల్సర్ తెచ్చుకుంటున్నారు? నిజమైన సమస్య ఆయన నాస్తికత్వం కాదు. దేవుడిని నమ్మకుండానే ఆయన విజయం సాధించడమే అసలు సమస్య. ఎందుకంటే దేవుడిని పిచ్చిగా ప్రార్థించినా విజయం సాధించలేని వారిని ఇది భయపెడుతోంది అని ఆర్జీవీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విశ్వాసులు దేవుడిని రక్షించడం మానేయాలి. అది దేవుడిని అవమానించినట్లే. రాజమౌళి నాస్తికుడైనంత మాత్రాన దేవుడి శక్తి తగ్గదు. నమ్మకం ఆగిపోయిన వెంటనే విశ్వాసం కూలిపోతుందని భావించే వారి ఇన్ సెక్యూరిటీ మాత్రమే పెరుగుతుంది అని ఆర్జీవీ అన్నారు. చివరిగా.. దేవుడు బాగానే ఉన్నాడు. రాజమౌళి బాగానే ఉన్నాడు. వీరిద్దరినీ అర్థం చేసుకోలేని వారు మాత్రమే బాధపడుతున్నారు. రాజమౌళి తదుపరి చిత్రం 'వారణాసి' ద్వారా దేవుడు ఆయన బ్యాంకు బ్యాలెన్స్‌ను మరింత పెంచుతాడు. దేవుడి నమ్మకం పేరుతో అసూయ పడుతున్న వాళ్లు ఏడుస్తూ కూర్చోవడమే. జై హనుమాన్ అంటూ ఆర్జీవీ తన వ్యాఖ్యలను ముగించారు.



## అనుష్కలా అన్ని పాత్రలు చేయగలగాలి

### అరుంధతి పాత్ర చాలా ఇష్టం అన్న భాగ్యశ్రీ

అరుంధతీ'లో అనుష్క చేసిన తరహా పాత్రలంటే ఇష్టం అని నటి భాగ్యశ్రీ భోర్సే అన్నారు. రామ్ పోతినేని హీరోగా నటించిన 'ఆంధ్రా కింగ్ తాలుకా' చిత్రంలో ఆమె కథానాయికగా నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలోమహేష్ బాబు.పి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 27న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే విలేకర్లతో మాట్లాడారు. నాకోసం ఎలాంటి కథలు రాసిపెట్టి ఉన్నాయో నాకు తెలియదు. వచ్చిన ప్రతి క్యారెక్టర్‌కి వందశాతం న్యాయం చేసేలా పని చేస్తా. వెర్సటైల్ యాక్ట్రెస్‌గా పేరు తెచ్చుకోవాలని కోరిక. ' అలాంటి పాత్రలు నాకూ వస్తాయని ఆశిస్తున్నా' అని భాగ్యశ్రీ భోర్సే అన్నారు. సినిమాలో మహాలక్ష్మి క్యారెక్టర్‌లో కనిపిస్తాను. కాలేజ్ గోయింగ్ గర్ల్. సాగర్‌తో ప్రేమలో ఉంటుంది. అంతకుమించి ఇప్పుడు ఎక్కువ క్యారెక్టర్ గురించి రివీల్ చేయకూడదు. కథకు ఈ పాత్ర చాలా ఇంపార్టెంట్.. అదేంటి అనేది తెరపైనే చూడాలి. నా పాత్రను ఆడియన్స్ తప్పకుండా గుర్తుపెట్టుకుంటారు. ఇందులో ప్రేమ కథ చాలా స్వచ్ఛంగా ఉంటుంది. లవ్ స్టోరీ, డైలాగ్స్ చాలా **బ్యూటిఫుల్‌గా ఉంటాయి. రామ్‌తో పనిచేయడం అమేజింగ్ ఎక్స్‌పీరియన్స్. అతని ఎనర్జీకి మ్యాచ్ చేశానని అనుకుంటున్నాను. సినిమా ఓ ఇంపార్టెంట్ సీన్‌ను దర్శకుడు వివరించారు. ఆ సన్నివేశాన్ని నేను ఎలా అనుకుంటున్నానో చేసి చూపిస్తానని దర్శకుడిని రిక్వెస్ట్ చేశా. నేను చేసింది అందరికీ నచ్చింది. అంత క్రియేటివ్ స్పేస్ ఇవ్వడం ఆనందం కలిగించింది. నిర్మాత సంస్థ కూడా అంతే స్పేస్ ఇచ్చింది. కాంప్రమైజ్ కాకుండా సినిమా తీశారు. మహేశ్ ఈ కథ చెప్పిన తర్వాత అభిమానం అన్నదానికి ఆన్సర్ దొరికింది. రెండు సినిమాలకే మంచి పేరు, ఫ్యాన్ ఫాలోయింగ్ పెరిగింది అంటుంటే చాలా ఆనందంగా ఉంది. ఆర్టిస్ట్‌కు మాత్రమే ఆ అదృష్టం ఉంటుంది. అందరూ తమ అమ్మాయిగా అభిమానాన్ని చూపించారు. ఆ అభిమానం మరింత పొందాలని కోరుకుంటున్నట్లు భాగ్యశ్రీ వెల్లడించింది.**

## ప్రభాస్ అభిమానులకు ఇక పండగే

### 23న రాజాసాబ్ నుంచి పాట విడుదల



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ది రాజా సాబ్' సినిమాకు సంబంధించిన కీలక అప్‌డేట్ విడుదలైంది. హారర్ చిత్రాల దర్శకుడు మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ మాస్ ఎంటర్‌టైనర్ 'ది రాజా సాబ్' నుంచి మొట్టమొదటి పాట విడుదల తేదీని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ మూవీ ఫస్ట్ సింగిల్ రెబల్ సాబ్ ను నవంబర్ 23న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తుండగా.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, జరీనా వాహేబ్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తుండగా బోమన్ ఇరానీ, సంజయ్ దత్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు.

## కొత్త తరానికి కొత్త కథ..ప్రేమంటే..



ప్రమోషన్ మొదలైన నాటినుంచి 'ప్రేమంటే' సినిమాపై ఆడియన్స్‌లో ఓ పాజిటీవ్ వైబ్ క్రియేటైంది. దానికి తోడు లియోన్ జేమ్స్ పాటలు కూడా జనబాహుళ్యంగా బాగా వినిపిస్తున్నాయి. ఖర్చును వెనుకాడని నిర్మాతలు పుస్కూర్ రామ్మోహన్‌రావు, జాన్వీ నారంగ్ ఈ చిత్రానికి నిర్మించడం.. యువతరానికి ఆకట్టుకునే ప్రియదర్శి, ఆనంది ఇందులో జంటగా నటించడం సినిమాపై ఆడియన్స్‌లో ఆసక్తి పెరగడానికి కారణాలని చెప్పొచ్చు. ఎట్టకేలకు శుక్రవారం 'ప్రేమంటే' విడుదలైంది. అభిప్రాయాలు కలవక పెళ్లికి దూరంగా ఉ ంటున్న అమ్మాయి రమ్య(ఆనంది). సమస్యల కారణంగా పెళ్లి వద్దనుకుంటున్న అబ్బాయి మదన్మోహన్ అలియాస్ మది(ప్రియదర్శి). వీరిద్దరూ అనుకోకుండా ఓ పెళ్లిలో కలుస్తారు. వారి కలయిక ప్రేమగా, ఆ తర్వాత పెళ్లిగా పరిఢమిల్లుతుంది. తొలి నెల వారి వైవాహిక జీవితం సంతోషంగా సాగిపోతుంది. కానీ తర్వాత నుంచి కష్టాలు మొదలవుతాయి. బాధ్యతలు రమ్యను ఆఫీస్‌కు నడిపిస్తాయి. సమస్యలు మదిని వ్యాపారం వైపుకు తరలిస్తాయి. అసలు సమస్య ఇక్కడే వచ్చిపడుతుంది. సీసీ కెమెరాలు, లాక్స్ సంబంధించిన బిజినెస్ మదిది. దీనికి సంబంధించిన వర్కంతా నైటే ఎక్కువ ఉంటుంది. దాంతో రమ్య ఆఫీస్ నుంచి ఇంటికి రావడం.. అదే టైమ్‌కి మది తన ఆఫీస్ వెళ్లిపోవడం.. ఈ కారణంగా వారి వైవాహిక జీవితం అసంతృప్తిగా తయారవుతుంది. ఇదిలావుంటే.. ఇంట్లో ఉన్న కొద్ది సమయంలో మది కదలికలు రమ్యకు అనుమానం కలిగిస్తాయి. తాను ఎవరితోనే రిలేషన్‌లో ఉన్నాడనే సందేహం రమ్యకు మొదలవుతుంది. అందుకు తగ్గట్టు సాక్ష్యాలు కూడా కనిపిస్తుంటాయి. దాంతో మదిని నిలదీస్తుంది రమ్య. ఇద్దరి మధ్య జరిగే గొడవలో అనుకోకుండా తన బిజినెస్‌కి సంబంధించిన రహస్యాన్ని బయటపెడతాడు మది. దాంతో రమ్య షాక్. అసలు మది చేస్తున్న బిజినెస్ ఏంటి? రమ్య ఎందుకు షాకయ్యింది? ఆ తర్వాత వీరిద్దరి వైవాహిక జీవితం ఎలాంటి మలుపు తీసుకుంది? అసలు చివరికి ఏం జరిగింది? అనేది అసలు కథ. ఈ సినిమా ఓ విధంగా హీరోయిన్ కథ. ఈ కథకు ప్రధానమైన సోల్ హీరోయిన్ పాత్రే. చెడ్డవాడైన భర్తతో కలిసి చెడ్డపనులు చేసే భార్యల కథలు విన్నాం. సకలగుణసంపన్నుడైన భర్త అడుగుజాడల్లో నడుస్తూ.. సుగుణవతిగా ఇంటిని చక్కబెట్టే భార్యల కథల్ని కూడా చూశాం. ఇందులో హీరోయిన్ కూడా ఓ విధంగా అలాంటి భార్యే. కాకపోతే ఇదోరకం. సాధారణంగా సమస్యల కారణంగా భర్త దొంగగా మారితే.. ఏ భార్యలైనా అతన్ని మార్చుకోడానికి ప్రయత్నిస్తారు. కానీ భార్య అలా కాదు. భర్త దొంగని తెలిసి.. భర్త సమస్యలను అర్థం చేసుకొని.. భర్తకు సాయంగా తాను కూడా దొంగలా మారుతుంది. ఓ విధంగా ఈ పాయింట్ నిజంగా కొత్తదే అనాలి. ఇందులో హీరోయిన్ వీక్నెస్ భర్తను అమితంగా ప్రేమించడమే. భర్త బలహీనతను కూడా ఇష్టపడటమే. నిజానికి అతడు చెడ్డవాడేం కాదు. తాను దొంగతనాలు కూడా యతికల్‌గా చేస్తాడు. అందుకే.. తాను కూడా భర్తతో కలిసి దొంగగా మారుతుంది. ఈ పాత్రలో ఆనంది నిజంగా అదరగొట్టిందనే చెప్పాలి. ఇందులో ఆనంది పోషించిన రమ్య పాత్ర జనాలకు పడితే.. సినిమా హిట్. పట్టకపోతే సినిమా ఫట్. ఈ విషయం దర్శకుడు నవనీత్ శ్రీరామ్ కొంతమేర సక్సెస్ అయ్యాడని చెప్పొచ్చు. ఓ వైపు గమ్మత్తైన ఈ కథను వినోదంగా ప్రజెంట్ చేస్తూనే.. మరోవైపు ఆ జంట మధ్య ఉండే పరస్పర ప్రేమానురాగాలను తెరపై చక్కగా ప్రజెంట్ చేశాడు దరశకుడు నవనీత్ శ్రీరామ్. ఆనంది, ప్రియదర్శి మధ్య వచ్చే సన్నివేశాలన్నీ సినిమా బావున్నాయి. సుమ, వెన్నెల కిశోర్ తమ పాత్రలను ఎప్పటిలాగే రక్తికట్టించారు. మిగతా నటీనటలంతా పరిధిమేర ఆకట్టుకున్నారు.సాంకేతికంగాదర్శకుడు రాసుకున్న కథ కొత్త ఉంది. కథనం కూడా ఆకట్టుకునేలా ఉంది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**